‘భారతరత్న’
మోక్షగుండం విశ్వేశ్వరయ్య



Bharataratna Mokshagundam Visweswaraya
By
JANAMADDI HANUMATH SASTRI

January 1991

Price : Rs. 15-00

Cover Design : Sri G. VENKATRAYULU

For Copies :
J. HANUMATH SASTRI
'Mahati'
1 / 1845 Gandhinagar
Kadapa - 516 004

J. NAGARAJ
Sahiti Books & Fancy Centre
Railway Station Road
Kadapa - 4

Printed at
Spandana Printers
Ramanaidupeta
Machilipatnam - 521 001

తెలుగు విశ్వవిద్యాలయ ఆర్థిక సహాయంచే ప్రచురితం

నివేదన

ప్రతిభావంతుడైన ఇంజనీర్‌గా, పాలనాదక్షుడుగా, నిష్కలంక చరిత్రుడుగ, నవభారత నిర్మాతలలో ఒకడుగ, ప్రజాసేవలో, దేశసేవలో అరిగిపోయిన మహనీయుడు డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

జాతి తన వీరుల ఆరాధనవల్లనే జీవిస్తుంది అన్న సూక్తి ఈ రచనకు స్ఫూర్తి.

విశ్వేశ్వరయ్యగారి జీవితచరిత్ర తెలుగులో రావాలని ఆకాంక్షించిన మిత్రులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ యస్. అశ్వత్థప్పగారు వారి మిత్రులు ; శ్రీ యం. శివశంకరయ్య, శ్రీ ఏ. అనంతపద్మనాభ, శ్రీ యం. జానకిరామ్‌గార్లు.

ఈ పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయం అందజేసిన తెలుగు విశ్వవిద్యాలయంవారికి కృతజ్ఞతలు.

ఈ రచన కుపకరించిన గ్రంథాలు :

డా॥ విశ్వేశ్వరయ్యగారి సన్నిహితులు, జ్ఞానపీఠ ప్రశస్తి విజేత, కీ॥ శే॥ మాస్తి వెంకటేశ అయ్యంగార్ సంపాదకత్వంలో వెలువడిన ' సర్. విశ్వేశ్వరయ్య '.

శ్రీ వి. యస్. నారాయణరావుగారి ' మోక్షగుండం విశ్వేశ్వరయ్య '. (నేషనల్ బుక్ ట్రస్ట్, ప్రచురణ)

విశ్వేశ్వరయ్యగారి ఆత్మకథ ' మెమోయిర్స్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్, (నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురణ)

శ్రీమతి శకుంతలా కృష్ణమూర్తిగారి ' డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య '.

ఇండియన్ సొసైటి ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (బెంగళూరు శాఖ) ప్రచురించిన, 'సర్. ఎం. విశ్వేశ్వరయ్యాస్ థాట్స్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్ '.

చివరి రెండు పుస్తకాలను పంపి సహకరించిన ప్రొఫెసర్ ఎం. ఆర్. కృష్ణమూర్తి (విశ్వేశ్వరయ్య అన్న కుమారుడు) గారికి, ఆ యా రచయితలకు, ప్రచురణకర్తలకు నా ధన్యవాదాలు.

ఈ రచనలో, గాంధీజీ-విశ్వేశ్వరయ్యగార్ల లేఖలను ప్రచురించుటకు అనుమతినిచ్చిన నవజీవన్ ట్రస్టు (అహమదాబాద్) మేనేజింగ్ ట్రస్టీ శ్రీ జితేంద్ర దేశాయ్‌గారికి కృతజ్ఞతలు.

ముఖచిత్రాన్ని అత్యంత ఆకర్షణీయంగా చిత్రించిన మిత్రులు, కళాకారులు శ్రీ జి. వెంకటరాయులుగారికి నా హార్దికాభినందనలు.

లోపలి అపురూప చిత్రాలు 'తరంగ' వారపత్రికనుండి సేకరించినవి. ఆ సంపాదకులకు నమస్సులు.

మైత్రికి చిహ్నంగా సమర్పించిన ఈ రచనను అంకితంగా స్వీకరించిన, గ్రంథాలయ శాస్త్రవేత్త డా॥ వెలగా వెంకటప్పయ్య గారికి కైమోడ్పు.

ఈ పుస్తకాన్ని సర్వాంగసుందరంగా అచ్చువేసిన మిత్రులు, స్పందన ప్రింటర్స్ అధినేత శ్రీ గుత్తికొండ సుబ్బారావుగారికి కృతజ్ఞతలు.

— జానమద్ది హనుమచ్ఛాస్త్రి

శ్రీ విశ్వేశ్వరయ్య జీవనపథం

1. జననం (ముద్దేనహళ్ళిలో) సెప్టెంబర్ 15 1861
2. బెంగళూరు సెంట్రల్ కాలేజ్ ద్వారా
   బి. ఏ. పట్టా పుచ్చుకోవటం 1881
3. పూనా ఇంజనీరింగ్ కాలేజ్ ద్వారా
   ఇంజనీరింగ్ పరీక్షలో ఉత్తీర్ణత 1883
4. అసిస్టెంట్ ఇంజనీర్‌గా నియామకం
   (బొంబాయి రాష్ట్రంలో) 1884
5. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదవీ ఉన్నతి 1888
6. పూనాలోని దక్కన్ క్లబ్ స్థాపక సభ్యులు
   శ్రీయుతులు రానడే, కేల్కర్, తిలక్,
   గోఖలేగార్ల సాహచర్యం 1891
7. సుక్కూర్ నగరం ప్రయాణం 1894
8. సుక్కూర్ బరాజ్ నిర్మాణం పూర్తిచేసి
   గవర్నర్‌చే ప్రశంసలందుకోవటం 1895
9. జపాన్ పర్యటన 1898
10. పూనా నగర జల విభాగం ఇంజనీర్
    'బ్లాక్ సిస్టం'—నిర్మాణం 1899
11. పూనా జలనిర్గమన పథకం అమలు 1901
12. ఆటోమేటిక్ స్లూస్‌గేట్ (స్వచ్ఛంద కవాటం)
    నిర్మాణం–పేటెంట్ చేసుకోకపోవటం—
    ప్రభుత్వంనుండి ప్రతిఫలం కోరకపోవటం 1903
13. ఏడెన్ జలనిర్గమన పథకం 1906
14. సూపరింటెండింగ్ ఇంజనీర్ 1907
15. హైదరాబాద్ నగర రక్షణ పథకం 1909 ఏప్రిల్ నుండి
    (స్పెషల్ కన్సల్టింగ్ ఇంజనీర్) అక్టోబర్ 1909

16. మైసూరు సంస్థాన ఛీఫ్ ఇంజనీర్ 1909 నవంబర్ నుండి 15-11-1912
17. మైసూరు సంస్థాన దివాన్ 1912 డిసెంబర్ నుండి 1918
18. మైసూరు విశ్వవిద్యాలయ స్థాపన
ఛేంబర్ ఆఫ్ కామర్స్ స్థాపన 1916
19. భద్రావతి ఉక్కు కర్మాగార స్థాపన 1918
20. జపాన్, కెనడా, అమెరికాలలో పర్యటన 1919
21. బొంబాయిలో జరిగిన అఖిల పక్ష
రాజకీయ సమ్మేళనాధ్యక్షత 1922
22. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షత 1923
23. భారతీయ ఆర్థిక సమ్మేళనాధ్యక్షత 1924
24. ఇండియన్ ఎకనమిక్ ఎంక్వైరి కమిటి అధ్యక్షత 1925
25. విదేశ పర్యటన 1926
26. స్వదేశ సంస్థాన ప్రజాపరిషత్ అధ్యక్షత 1926
27. విదేశ పర్యటన 1935
28. బెంగళూరులో విమాన కర్మాగార పథకం
రూపొందించుట 1939
29. అఖిల భారత ఉత్పత్తిదారుల సంఘ స్థాపన 1941
అధ్యక్షత 1941-54
30. గ్రామీణ పరిశ్రమల పథకం 1949
31. 'మెమోయిర్స్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్'
(ఆత్మకథ) ప్రచురణ 1951
32. బీహార్‌లో గంగానదిపై రైల్వే బ్రిడ్జి
నిర్మాణానికి తగిన స్థలం ఎంపిక 1952
33. భారతరత్న అవార్డు ప్రదానం సెప్టెంబర్ 7, 1955
34. శతజయంతి ఉత్సవం సెప్టెంబర్ 15, 1961
35. మరణం ఏప్రిల్ 14, 1962
ఉదయం గం. 6-15 ని॥లకు బెంగళూరులో

అందుకున్న ప్రధాన సత్కారాలు

1904 లండన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సంస్థ గౌరవ సభ్యత్వం

1911 సి. ఐ. ఇ. (కంపానియన్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్) ఢిల్లీ దర్బారులో బిరుదం.

1915 కె. సి. ఐ. ఇ. — బిరుదం.

1921 కలకత్తా విశ్వవిద్యాలయంచే డి.ఎస్.సి. గౌరవ ప్రశస్తి.

1931 బొంబాయి విశ్వవిద్యాలయంనుండి ఎల్. ఎల్. డి. గౌరవ పట్టం.

1937 బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంచే డి. లిట్ గౌరవ పట్టం.

1943 ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) గౌరవ శాశ్వత సభ్యులుగా ఎంపిక

1944 అలహాబాద్ విశ్వవిద్యాలయంచే డి. యస్. సి. గౌరవ పట్టం.

1947 ఆంధ్ర విశ్వవిద్యాలయంచే డి. ఎస్. సి. గౌరవ పట్టం.

1948 మైసూరు విశ్వవిద్యాలయంనుండి గౌరవ డాక్టరేట్ పట్టం.

1953 ఆంధ్ర విశ్వవిద్యాలయంనుండి డి. లిట్. పట్టం.

1953 ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ (ఇండియా) వారిచే విశిష్ట సభ్యత్వ సత్కారం.

1955 ‘భారతరత్న’ — సత్కారం.

1958 జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంచే డి. ఎస్. సి. గౌరవ పట్టం.

1958 రాయల్ ఏషియాటిక్ సొసైటి కౌన్సిల్ (బెంగాల్) చే దుర్గాప్రసాద్ ఖైతాన్ మెమోరియల్ స్వర్ణపతక సత్కారం.

1959 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వారిచే విశిష్ట సత్కారం.

సూ చి క

Biography ; especially of the great and good, who have risen by their own exertions to eminence and usefulness, is an inspiring and ennobling study. Its direct tendency is to reproduce the excellence it records

– H MANN

" The best portions of a good man's life is his little nameless, unremembered acts of kindness and of love ".

అంకితం

గ్రంథాలయ శాస్త్రవేత్త, మిత్రులు

డా॥ వెలగా వెంకటప్పయ్యగారికి



మైసూర్ దర్బార్ దుస్తుల్లో
సర్ మోక్షగుండం
విశ్వేశ్వరయ్య



1945 లో
మోక్షగుండం విశ్వేశ్వరయ్య



భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య

మోక్షగుండం విశ్వేశ్వరయ్య మైసూరు సంస్థానం లోని కోలారుజిల్లా చిక్కబళ్ళాపుర తాలూకాలోని ముద్దేనహళ్ళిలో 1861 సెప్టెంబరు 15 తేదీన జన్మించారు. తండ్రి శ్రీనివాసశాస్త్రి తల్లి వెంకటలక్ష్మమ్మ.

భారతరత్న జవహర్‌లాల్ తండ్రి మోతీలాల్‌నెహ్రూ, వారణాసి హిందూవిశ్వవిద్యాలయ స్థాపకులు మదనమోహన్ మాలవ్యా, విశ్వకవి రవీంద్రనాథటాగూర్ 1861 లో జన్మించిన మహనీయులు.

విశ్వేశ్వరయ్య పూర్వీకులు కర్నూలుజిల్లా (ప్రస్తుతం ప్రకాశంజిల్లా) గిద్దలూరు సమీపంలోని మోక్షగుండం అనే గ్రామంలో ఉండేవారు. 17వ, శతాబ్దంలో విశ్వేశ్వరయ్య తాత గారు కుటుంబంతోపాటు ముద్దేనహళ్ళి చేరారు. అక్కడే విశ్వేశ్వరయ్య జన్మించారు.

విశ్వేశ్వరయ్య తండ్రిగారైన శ్రీనివాసశాస్త్రిగారు సంస్కృత విద్వాంసులు. సనాతన సంప్రదాయాలపట్ల భక్తి శ్రద్ధలు

కలవారు. తల్లి వెంకటలక్ష్మమ్మ తమిళనాడుకు చెందినవారు. విశ్వేశ్వరయ్య జననీజనకులు యాత్రలుచేస్తూ కంచికామకోటి పీఠాధిపతుల దర్శనం చేసుకున్నారు. జంబుకేశ్వరం సమీపం లోని తిరువన్‌కావల్‌లోని ఆలయాన్ని దర్శించారు. అచటనే విశ్వేరయ్య ఉపనయనం జరిగింది. అప్పట్లో నైజాం సంస్థానంలో భాగంగావున్న రాయచూర్ పర్యటనలో ఉన్నప్పుడు శ్రీనివాసశాస్త్రిగారు స్వర్గస్తులయ్యారు. అపుడు విశ్వేశ్వరయ్య వయసు 15 ఏళ్ళు.

చిక్కబళ్ళాపురలో లోయర్ సెకండరి పరీక్ష(8వ తరగతి) లో ఉత్తీర్ణుడైన విశ్వేశ్వరయ్య పై చదువు సాగించడానికి ఆర్థిక యిబ్బంది ఏర్పడింది. మేనమామ రామయ్య బెంగళూరులో ఉండేవాడు. ఆయన సామాన్య కుటుంబీకుడు. అల్లుడు ప్రతిభావంతుడని విన్నాడు. విశ్వేశ్వరయ్యను రప్పించుకొని 1875 లో వెస్లియన్ మిషన్ హైస్కూల్‌లో చేర్పించాడు.

తెలివితేటలతోపాటు పెద్దలపట్ల, గురువులపట్ల భక్తిశ్రద్ధలు కలవాడు విశ్వేశ్వరయ్య. చిక్కబళ్ళాపుర పాఠశాలలో ఉపాధ్యాయులుగ వుండిన కృష్ణగిరి రాఘవేంద్రరావుగారు విశ్వేశ్వరయ్యను ఎంతగానో ప్రోత్సహించేవారు.

ఆ కాలంలో ఉపాధ్యాయులకు వేతనాలు తక్కువ. అల్పవేతనంతో కుటుంబ పోషణ భారమని భావించిన రాఘవేంద్రరావుగారు,తమ ఉద్యోగానికి రాజీనామాచేసి బెంగళూరు చేరారు. వకీలు పరీక్షలో కృతార్థులై న్యాయవాదిగ స్థిరపడ్డారు. బాగానే సంపాదించేవారు.

ఒకమారు రాఘవేంద్రరావుగారు పాదచారులై, చిక్‌పేట జనసందోహంగుండా తమ కార్యాలయానికి వెళ్తున్నారు. వారికి దగ్గరలోనే హఠాత్తుగ ఒక గుర్రపుబండి ఆగింది. విదేశీ దుస్తులు, తలపై మైసూరు తలపాగాతో ఒక వ్యక్తి బండి

దిగారు. రాఘవేంద్రరావుగారిముందు నిల్చుని 'నమస్కారం సర్' అని వినయపూర్వకంగా నిల్చున్నారు. రాఘవేంద్ర రావుగారు స్తబ్ధులై నిల్చున్నారు. "సర్, మీరు నన్ను మరచినట్లున్నారు. చిక్‌బళ్ళాపురలో మీవద్ద చదువుకున్న విశ్వేశ్వరుణ్ణి" అన్నాడు. రాఘవేంద్రరావు ఆశ్చర్యానికి ఆనందానికి అవధులు లేవు. ఆ యువకుణ్ణి కౌగలించుకున్నారు. ఆ యువకుడు అప్పటికే మైసూరు సంస్థానం ఛీఫ్ ఇంజనీర్.

"చాల సంతోషం నాయనా, చిన్నవయసులోనే ఛీఫ్ ఇంజనీర్ అయ్యావు. నీవు దివాన్ కావాలి." చిరంజీవి కమ్మని ఆశీర్వదించారు.

* * *

హైస్కూలు చదువు ముగించి విశ్వేశ్వరయ్య సెంట్రల్ కాలేజిలో చేరాడు. మేనమామ ఇంట్లో భోజనం జరిగేది. పుస్తకాలకు దుస్తులకు పైకం అవసరం. కాలేజి వేళల తర్వాత మహారాజాగారివద్ద మంత్రిగా వుండిన ముద్దయ్యగారి పిల్లలకు పాఠాలు చెప్పేవారు. ఉదయం తన చదువు, సాయంత్రం ప్రైవేట్ చెప్పటం. రోజూ పదిమైళ్ళ నడక సాగించేవారు.

కొందరు బీదరికంతో కృంగిపోతారు. నిరాశతో క్రియా శూన్యులవుతారు. విశ్వేశ్వరయ్య పట్టుదలతో ముందంజ వేశారు.

మెట్రిక్యులేషన్ పరీక్షకు కట్టవలసిన పైకానికి యిబ్బంది ఏర్పడింది. తల్లి చిక్కబళ్ళాపురలో వుంది. బెంగుళూరునుండి చిక్కబళ్ళాపురకు బస్సులులేని కాలం. 35 మైళ్ళదూరం నడచి తల్లివద్దకు వెళ్ళాడు. ఆమెవద్ద మాత్రం డబ్బెక్కడిది? పొరుగింటి వైశ్యులవద్ద తనవద్దనున్న రాగి హండాను కుదువపెట్టి, పన్నెండు రూపాయలు తెచ్చి కుమారునికి

యిచ్చింది. ఆ రాత్రి అక్కడనే ఉండి వేకువనే లేచి మరలా బెంగుళూరుకు పాదచారిగ బయలుదేరాడు. కాలేజికి చేరటంలో ఆలస్యమైంది. గుమాస్తా, " ఫీజు చెల్లించేవేళ అయిపోయింది, వెళ్ళిపో, " అన్నాడు. చివరకు ఒక అధికారి సిఫారసుపై పైకం చెల్లించగలిగాడు. ఆ సంవత్సరం జరిగిన మెట్రిక్ పరీక్షలో మొదటి శ్రేణిలో మొదటివాడుగ ఉత్తీర్ణులయ్యారు విశ్వేశ్వరయ్య.

విశ్వేశ్వరయ్య క్రమశిక్షణకు మారుపేరు. మంత్రి పుద్దయ్యగారి కుమారుడు నంజప్ప విశ్వేశ్వరయ్యగారి శిష్యుడు. తర్వాత నంజప్ప సంస్థానంలోని సీనియర్ సర్జన్ అయ్యాడు.

సెంట్రల్ కాలేజీలో గణితం, ఆంగ్లవిషయాలలో విద్యార్థిగ 1881లో మొట్టమొదటిస్థానంలో పట్టాపుచ్చుకున్నాడు. ప్రిన్సిపల్ విశ్వేశ్వరయ్యను అభినందిస్తూ వెబ్‌స్టర్ డిక్షనరిని బహూకరించాడు. నాటినుండి ఆ నిఘంటువు కొత్త ఎడిషన్ వచ్చినపుడల్లా, కొనే అలవాటు విశ్వేరయ్యగారికి ఏర్పడింది.
ఇంజనీరింగ్‌లో ఉన్నత శిక్షణకు బెంగళూరులో వీలుండేది కాదు. మైసూరు సంస్థానం దివాన్‌గా ఉండిన రంగాచార్లుగారు విద్యార్థివేతనం మంజూరు చేశారు. పూనా వెళ్ళి అచటి ఇంజనీరింగ్ కాలేజీలో చేరి 'ఎల్.సి.ఇ.,ఇ.సి.యల్.' పరీక్షలలో రాష్ట్రం మొత్తంపై మొదటివారుగ ఉత్తీర్ణులయ్యారు. ఆ పరీక్షలు నేటి, బి.టెక్ పరీక్షలకు సమానం. అత్యుత్తమ విద్యార్థిగ నెగ్గినందుకు 'బర్క్లే' బంగారు పతకం అందుకున్నారు.

సెంట్రల్ కాలేజి ప్రిన్సిపల్ ఛార్లెస్ వాటర్ పదవీ విరమణానంతరం లండన్ వెళ్ళిపోయారు. విశ్వేశ్వరయ్య లండన్ వెళ్ళినప్పుడల్లా వారి దర్శనం చేసుకునేవారు. ప్రిన్సిపల్ ఛార్లెస్‌వాటర్ చనిపోయేముందు తన కోటు బంగారు గుండీలను

తన జ్ఞాపికలుగా విశ్వేశ్వరయ్యగారికి అందించమని భార్యను కోరాడు. ఆ ఇల్లాలు భర్త అభీష్టం మేరకు బంగారు గుండీలను విశ్వేశ్వరయ్యగారికి స్వయంగా అందజేసింది. శిష్యునిపట్ల ఆ దంపతుల ప్రేమాభిమానాలు మరువరానివి.

1883 నవంబర్ నెలలో ఇంజనీరింగ్ పరీక్షలో కృతార్థుడైన విశ్వేశ్వరయ్య 1884 మార్చి నెలలో బొంబాయి రాష్ట్రప్రభుత్వంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా నియమితులయ్యారు.

శారీరకంగా విశ్వేశ్వరయ్య దుర్బలురు. కాని మంచి ఆరోగ్యం కలవారు. పూనాలో చదువుకునే రోజుల్లో సెలవు కాలంలో చిక్కబళ్ళాపుర వచ్చేవారు. ఆవూరిలోనే ఉపాధ్యాయులు, రామచంద్రశాస్త్రిగారి కూతురుతో వివాహం జరిగింది. తల్లి వెంకటలక్ష్మమ్మ కోడలికి 'సావిత్రి' అని పేరు పెట్టింది. విశ్వేశ్వరయ్య తన భార్య, తల్లితోపాటు పూనాలో కాపురం పెట్టారు. కాని ఆ వాతావరణం సరిపడనందున తల్లి చిక్కబళ్ళాపురం తిరిగి వచ్చింది. 1888 అక్టోబరు 7వ తేదీన విశ్వేశ్వరయ్యగారికి మగ సంతానం కల్గింది. ప్రసవానంతరం తల్లీ, బిడ్డ యిరువురూ మరణించినారు.

పుత్రుని సుఖాన్ని కోరుతూ తల్లి రెండోమారు పెళ్ళి చేసింది. ఈ కోడలికి కూడా 'సావిత్రి' అని పేరు పెట్టింది. విధి విలాసమేమోకాని రెండవభార్యకూడా ప్రసవానంతరం కన్ను మూసింది. శిశువు కూడా దక్కలేదు.

మాతృప్రేమకు హద్దులుంటూ వుండవు. కుమారునికి ఇష్టంలేకున్నా, అతనిని ఒప్పించి సేలం జిల్లా కుప్ప గ్రామానికి చెందిన కన్యను నిశ్చయించి పెళ్ళి జరిపించింది. విశ్వేశ్వరయ్యగారు తృతీయ కళత్రంతో పూనాలో కొంతకాలం కాపురం చేశారు. కాని ఆమె ప్రవర్తన విశ్వేశ్వరయ్యగారికి నచ్చలేదు.



మైసూర్ దర్బార్ దుస్తుల్లో
సర్ మోక్షగుండం
విశ్వేశ్వరయ్య



1945 లో
మోక్షగుండం విశ్వేశ్వరయ్య

స్వేచ్ఛంద కవాటం

బొంబాయి ప్రభుత్వం పంజ్రానదీ జలాలను దతారి గ్రామానికి 'సైఫన్' పద్ధతిద్వారా సరఫరా చేసేందుకు సమ్మతించింది. ఆ పథకం అమలుజరిపే బాధ్యత విశ్వేశ్వరయ్య గారికి అప్పగించారు. ఆ ప్రాంతం కొండలమయం. పైగా విపరీతమైన వర్షం. శ్రమ, ఖర్చు రెంటిని తగ్గించాలన్న లక్ష్యంతో, వర్షాకాలంతర్వాత పనిని ప్రారంభించటం సముచితమని విశ్వేశ్వరయ్య పై అధికారులకు రాశారు.

'మా ఉత్తర్వులను అమలుచేయటం మీ కర్తవ్యం. ఆదిలోనే హంసపాదులా నిర్మాణ కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవటం వీలుపడదు' అన్నారు అధికారులు. విశ్వేశ్వరయ్య సరే అన్నారు. ఎక్కువ వ్యయమైనా భరించుటకు సమ్మతించమని ప్రభుత్వానికి రాశారు.

విశ్వేశ్వరయ్య తమ ఆఫీసునుండి రెండున్నర మైళ్ళ దూరంలోని నిర్మాణం వద్దకు ప్రతిరోజూ గుర్రంపై వెళ్ళేవారు. ఒకనాడు కుండపోతగా వర్షం పడింది. ఉధృతంగా ప్రవహిస్తున్న నదిని దాటి తమ విడిదికి చేరుకోవటం అసాధ్యమైంది. నిర్మాణంలో కూలీలుగా పనిచేస్తున్న గిరిజనులు విశ్వేశ్వరయ్యగారికి వసతి కల్పించారు. వారాయనను ఎంతో గౌరవంగా చూచారు. విశ్వేశ్వరయ్య కూలీలను, క్రింది అధికారులను ఉత్తేజపరుస్తూ మాట్లాడేవారు. రెండు నెలల్లోనే పంజ్రానదీ జలాన్ని 'సైఫన్' పద్ధతిద్వారా సరసరా చేయటంలో కృతకృత్యులయ్యారు. పై అధికారులు విశ్వేశ్వరయ్యగారి కార్యదక్షతను ప్రశంసించారు.

ఉద్యోగ బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆ ప్రాంత ప్రజల భాష మరాఠీతో పరిచయం పెంచుకున్నారు. కాని మలేరియా జ్వరగ్రస్తులయ్యారు. ఆరోగ్య కారణంగా బదలీచేయమని కోరగా విశ్వేశ్వరయ్యగారిని పూనాకు

మార్చారు. పూనా నగరంలో భవనాలు రహదార్లు విభాగంలో పనిచేస్తూ మంచి పేరు సంపాదించారు.

అది ప్రభుత్వ సంస్థ కావచ్చు, ప్రైవేట్ యాజమాన్యం కావచ్చు, నిజాయితీతో పనిచేసేవారికే మరిన్ని బాధ్యతలు అప్పగించటం సహజం. సింధ్ ప్రాంతం బొంబాయి రాష్ట్రంలో భాగంగా ఉండేది. సింధునదీ జలాలను సుక్కూరు పట్టణానికి సరఫరా చేయుటకు ప్రభుత్వం నిశ్చయించింది. అందుకోసం మొదట ఒక ఆంగ్ల ఇంజనీర్‌ను నియమించారు. ఆ ప్రాంతంలో విపరీతమైన ఎండలు - అంతే తీవ్రంగా చలిగాడ్పులు. అనారోగ్యకరమైన ఆ ప్రాంతానికి పోవటానికి ఇంజనీర్‌లు ఎవరూ ముందుకురాలేదు.

చివరకు ఛీఫ్ ఇంజనీర్ రెనాల్డ్, విశ్వేశ్వరయ్యగారికి లేఖ రాస్తూ. 'మీ బుద్ధి కుశలత, కార్యదక్షత, అనుభవం గురించి ప్రభుత్వానికి యిదివరకే ఎన్నో నివేదికలు పంపబడ్డాయి. సుక్కూర్ బ్యారేజ్ నిర్మాణ పర్యవేక్షణకు మీకంటే సమర్థులైన ఇంజనీర్ మరెవరూ రాష్ట్రంలో లేరని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నాను. కార్యక్రమ నిర్వహణలో మీకు పరిపూర్ణమైన స్వేచ్ఛను యివ్వాల్సిందిగా ప్రభుత్వానికి రాస్తున్నాను. మీరీ పథకాన్ని నిర్వహించాలి' అన్నారు. ఛీఫ్ ఇంజనీర్ తనపై ఉంచిన విశ్వాసాన్ని మన్నించి సమ్మతించారు.

సింధునది నీటిలో వండ్రు ఎక్కువ. విశ్వేశ్వరయ్య నదీతీరంలో పెద్దబావులను త్రవ్వించారు. నదీ జలాలను ఇసుక పొరలగుండా బావుల్లోకి చేరేటట్లు చేశారు. ఇందువల్ల నీరు జల్లెడపట్టినట్లు శుభ్రమవుతాయి. పరిశుద్ధమైన నీటిని పంప్‌చేసి గుట్టపైనున్న పెద్ద జలాశయంలో నింపేవారు. గొట్టాలద్వారా పట్టణానికి నీటి సరఫరా జరిగేది. ఇట్టి పద్ధతివల్ల ఎంతో ఆదా అయింది.

విశ్వేశ్వరయ్య జలాశయాలకు పెద్ద ఉక్కు తలుపులు ఏర్పాటు చేయించారు. ఈ కవాటాలు రిజర్వాయర్‌లో ఎనిమిది అడుగుల నీటిని భద్రపరచేవి. అంతకు మించిన నీరు బయటికి వదిలేవారు. ఎనిమిది అడుగుల వరకు నీరు నిండిన వెంటనే తలుపులు తమంతట తాము తెరచుకొని, అదనపు నీరు పొర్లి పోయేలా చేసేవి. ఇదొక అద్భుతం!

ఈ స్వచ్ఛంద కవాటాల నిర్మాణాన్ని దేశంలోని ఇంజనీర్లు, గవర్నర్లు ఎంతగానో ప్రశంసించారు. భారత సేనల ప్రధానాధిపతి లార్డ్ కిచనర్ విశ్వేశ్వరయ్య ప్రతిభను కొనియాడాడు. ఈ కవాట నిర్మాణాన్ని యితరులు వ్యాపారార్థం చేపట్టడానికి వీలులేకుండా 'పేటెంట్' చేసుకోమని కొందరు మిత్రులు విశ్వేశ్వరయ్యగారికి సూచించారు. 'ప్రభుత్వోద్యోగిగా, నా కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఈ ప్రక్రియను రూపొందించాను. 'పేటెంట్' చేసుకోను' అన్నారు. ఈ విధానం పూనా సమీపంలోని కర్క్, గ్వాలియర్‌లోని టిగ్రా, మైసూరు సమీపంలోని కృష్ణరాజ సాగర ఆనకట్టలలో అమలుజరిగి అత్యంత ప్రయోజనకరంగా నేటికీ పనిచేస్తున్నాయి.

• • •

ఏడెన్ నగరానికి నీటి సరఫరా

రవి అస్తమించని సామ్రాజ్యం అంటూ ఆంగ్లేయులు సగర్వంగా చెప్పికొన్న కాలమది. భారతదేశంనుండి, ఇంగ్లండుకు వెళ్ళే నౌకలు సూయెజ్ కాలువద్వారా వెళ్తుండేవి. సూయెజ్ కాలువ ప్రవేశ ద్వారంవద్ద ఏడెన్ రేవుపట్టణం వుంది. ఈ కాలువద్వారా ఇంగ్లండుకు వెళ్ళడంవల్ల దూరం, కాలం రెండూ కలసివచ్చేవి. యుద్ధతంత్రరీత్యా సూయెజ్ కాలువ రక్షణ బ్రిటన్‌కు చాల ముఖ్యం. అందువల్ల ఏడెన్ గొప్ప సైనిక స్థావరమైంది.

ఉన్నతోద్యోగాలన్నీ తెల్లదొరలకే పరిమితంగా వుండేవి. ప్రతిభ, కార్యదక్షతలకు గుర్తింపు అంతగా వుండేదికాదు.

1904 లో విశ్వేశ్వరయ్య బొంబాయి రాష్ట్ర శానిటరీ ఇంజనీర్‌గా నియమితులయ్యారు. బొంబాయి విశ్వవిద్యాలయ సెనెట్ సభ్యులుగా విశ్వేశ్వరయ్యగారిని ఎన్నుకొన్నారు. ఇంజనీరింగ్ పాఠ్యాంశాలను విశ్వేశ్వరయ్య రూపొందించారు.

ఏడెన్ నగర పాలనా బాధ్యతలు బొంబాయి రాష్ట్రానికి చెందిఉండేవి. ఏడెన్ నగర పారిశుధ్యం, మంచినీటి సరఫరా, రహదార్ల నిర్మాణం గురించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తపథకాలను రూపొందించాలని నిశ్చయించింది. నగర ప్రజలు తాగు నీటికోసం తహతహలాడేవారు. సముద్ర జలాలను ఆవిరిగా మార్చి, గొట్టాలద్వారా నగరానికి చేరవేసి, ఆ తర్వాత ఆవిరిని నీరుగా, నగరంలోని సైనిక శిబిరాలకు, ప్రజలకు సరఫరా చేసేవారు. వంద గాలన్ల నీటిని సరఫరా చేసేందుకు మూడు రూపాయలు వసూలుచేసేవారు.

ఏడెన్ నగర నీటి సమస్యను పరిష్కరించుటకు చర్యలు తీసుకోవలసిందిగా బ్రిటిష్ ప్రభుత్వం ఇండియా ప్రభుత్వాన్ని

కోరగా, ఆ బాధ్యత బొంబాయి రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. ఈ పథకం అమలుచేయగల నేర్పు, దక్షత కలవారు విశ్వేశ్వరయ్యగారొక్కరేనని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది.

1906 లో విశ్వేశ్వరయ్య ఏడెన్ నగరం వెళ్ళారు. నగరం చుట్టూ అరవై మైళ్ళ ప్రాంతం అంతటా కొండలు గుట్టలు. పడిన కొద్దిపాటి వర్షం కొండలకు చేరువగావున్న ఎడారిగుండా ప్రవహించి ఇంకిపోతున్నాయి. ఏడెన్ నగరానికి 18 మైళ్ళ దూరంలోని లహేజ్‌వద్ద బావులు త్రవ్వి గొట్టాలద్వారా ఏడెన్ నగరానికి నీటిని సరఫరా చేయునట్లు నిర్ణయింపబడింది.

లహేజ్ పరిసర ప్రాంతం ఒక సుల్తాన్‌కు చెందింది. అతడు స్వతంత్రుడు. ఆ ప్రజలు అనాగరికులు. సుల్తాన్‌తో సంప్రదించటం ఇంజనీర్ విశ్వేశ్వరయ్యగారికి సంబంధించిన విషయం కాదు. అయినా విశ్వేశ్వరయ్య సుల్తాన్‌ను కలుసుకొని అతని అనుమతి పొందారు, మంచినీటి సౌకర్యం కల్పించారు. ప్రజారోగ్యంకోసం భూగర్భ మురుగుకాల్వలను నిర్మింపచేసి ఏడెన్ నగర ప్రజల మన్ననల నందుకొన్నారు.

విశ్వేశ్వరయ్య కృషిని ప్రశంసిస్తూ ప్రభుత్వం వారిని 'కెయిజర్–ఇ–హింద్' స్వర్ణపతకంతో సత్కరించింది.

పెద్ద డిగ్రీలు పుచ్చుకున్నవారందరూ మహామేధావులు అనటానికి వీలులేదు. ప్రజ్ఞతోపాటు అనుభవం అవసరం.

• • •

స్వదేశానికి రాక

కొల్హాపూర్ సంస్థానంలోని మహాలక్ష్మి దేవాలయం అతి ప్రసిద్ధమైనది. సంస్థాన రాజధాని అయిన కొల్హాపుర్‌లో మంచినీటి కొరత తీవ్రస్థాయికి చేరింది. ఒకే ఒక ఆధారమైన నగర జలాశయంలోని ఒక గట్టు తెగి నీరు వృథాగా ప్రవహించే పరిస్థితి ఏర్పడింది. మహారాజా అభ్యర్థనమేరకు, సంస్థానంలో రెసిడెంట్‌గాఉన్న కల్నల్ ఫెరిస్ బొంబాయి రాష్ట్ర ప్రభుత్వానికి తాగు నీటికొరత వలన ఏర్పడనున్న ప్రమాదాన్ని తెలిపాడు.

రాష్ట్ర ప్రభుత్వం విశ్వేశ్వరయ్యగారిని కొల్హాపుర్‌కు పంపింది. విశ్వేశ్వరయ్య స్థానిక ఇంజనీర్లకు సముచిత సలహాలిచ్చి తటాకం భద్రంగా వుంచేందుకు సూచనలిచ్చారు. సంస్థాన ప్రభువు, ప్రజలు విశ్వేశ్వరయ్యగారికి తమ కృతజ్ఞతలను వెల్లడించారు.

కార్యనిర్వహణలో దీక్ష, దక్షత, నిజాయితీ, క్రమశిక్షణల వల్ల విశ్వేశ్వరయ్య ప్రభుత్వ వర్గాలలోను, ప్రజల్లోను ప్రశంస లందుకున్నారు. వీరి అసాధారణ గుణగణాలను గుర్తించి ప్రభుత్వం వీరిని 18 మంది ఆంగ్ల ఇంజనీర్లకంటే వున్నతులుగా పరిగణించి సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పదవీ వున్నతి కల్పించింది. ఈ నియామకం చాలమందికి కంటగింపు కల్గించింది. ఆ కాలంలో పెద్ద ఉద్యోగాలన్నీ ఆంగ్లేయులకు మాత్రమే యిచ్చేవారు.

విశ్వేశ్వరయ్య ఛీఫ్ ఇంజనీర్ పదవికి అన్నివిధాలా అర్హులనిపించుకొన్నారు. కాని ఆ పదవి ఇంగ్లీష్‌వారికి మాత్రమే నిర్ధరింపబడిందని తెలిసికొన్నారు. ఆ పదవి న్యాయంగా విశ్వేశ్వరయ్యగారికి లభించవలసిందే. అలా కాని పక్షంలో తమ ఉద్యోగానికి రాజీనామా యివ్వవలెనని నిశ్చయించారు.

ఈ సంగతి తెలిసిన మిత్రులు, అభిమానులు రాజీనామా చేయవద్దని గట్టిగా చెప్పారు. అప్పటికి విశ్వేశ్వరయ్య ఉద్యోగములోచేరి ఇరవై మూడేళ్లు అయింది. మరో రేండేళ్లు పనిచేస్తే పింఛన్ లభించేది. ఎందరెంతగా చెప్పినా, తమ నిర్ణయానికి తిరుగులేదన్నారు. తమ రాజీనామాను గవర్నర్‌కు పంపారు.

రాజీనామా లేఖను చూచి గవర్నర్ సిడెన్‌హాం చకితుడయ్యాడు. ప్రభుత్వం విశ్వేశ్వరయ్య అసాధారణ కార్యదక్షతను గుర్తించి పెద్దపదవులను యిస్తూ వచ్చింది. మరో రెండేళ్లు పనిచేస్తే పింఛన్ వస్తుంది. అయినా యీ తొందర పాటేమిటి అనుకున్నాడు గవర్నర్.

విశ్వేశ్వరయ్యగారిని గవర్నర్ తన వద్దకు రప్పించాడు. రాజీనామా లేఖను ఉపసంహరించుకోమని నచ్చచెప్పాడు. 'మరి కొంతకాలం పనిచేయండి. నేనీపదవిలో ఉన్నపుడే, ఛీఫ్ ఇంజనీర్‌గా భారతీయులు అనర్హులన్న నియమాన్ని రద్దు చేయించి, మీకు ఆపదవి లభించేటట్లు చేస్తాను' అన్నాడు.

పాతికేళ్లు పనిచేసి పింఛన్ తీసుకుని సుఖంగా ఉండడం ఒక వైపు, ఆత్మాభిమానం దేశాభిమానం మరోవైపు. గుండె దిటవుతో విశ్వేశ్వరయ్యగారు స్వాభిమాన ధనాన్నే ఎంచుకొన్నారు. భారతీయుల ప్రతిభకు పరిగణనలేని పదవి ఎందుకు? అన్న నిర్ణయంతో రాజీనామాకే పట్టుపట్టారు. గవర్నర్ సిడెన్‌హ్యాం పూర్తి పింఛన్ మంజూరుచేస్తు రాజీనామా అంగీకరించాడు.

1908 మే నెలలో పదవీత్యాగం చేసిన విశ్వేశ్వరయ్యగారిని ఇరువురు సంస్థానాధిపతులు ఛీఫ్ ఇంజనీర్‌గా రమ్మని ఆహ్వానించారు. వారి అభ్యర్థనలను విశ్వేశ్వరయ్య సవినయంగా తిరస్కరించారు.

ఉన్నత విద్యానుభవాలకోసం యూరోప్‌లోని కొన్ని దేశాలు పర్యటించి లండన్‌లో కొంతకాలం వున్నారు. అక్కడ ఉన్నపుడే హైదరాబాద్ నైజాం అభ్యర్థనమేరకు భారత ప్రభుత్వంనుండి సందేశం అందింది. వెంటనే హైదరాబాద్ సంస్థాన ఛీఫ్ ఇంజనీర్‌గా రావలసిందని ఆహ్వానించారు. తమ పర్యటన పూర్తికానిదే ఏ పదవిలోనూ చేరనని బదులు రాశారు. మరెవరినైనా నియమించుకోమని రాశారు. అంతేకాక కొన్ని షరతులు తెలిపారు. హైదరాబాద్ సంస్థాన ప్రధాన ఇంజనీర్ ఆంగ్లేయుడు. అతనితో సమానంగా అధికారం, వేతనం, తనకు నచ్చిన ఉద్యోగులను ఎన్నుకొనే స్వేచ్ఛ కల్పించాలన్నారు. నిజాం ఆ షరతులన్నిటినీ ఆమోదించాడు.

1909 ఏప్రిల్ నాటికి అమెరికా, కెనడా మున్నగు దేశాల పర్యటన ముగించి, భారతదేశానికి తిరిగివచ్చి హైదరాబాద్ సంస్థాన స్పెషల్ ఇంజనీర్ పదవిని చేపట్టారు. 1908 సెప్టెంబర్ 28 న హైదరాబాద్ నగరం మూసీనది ప్రళయానికి గురయింది. నగరాన్ని వరదలనుండి కాపాడి, మంచినీటి వసతి, నగర పునర్నిర్మాణం, భూగర్భ మురుగు కాలువలు మున్నగు కార్యక్రమాలకు పథకాలను ఏర్పాటుచేసి నిర్వహించవలసినదిగా విశ్వేశ్వరయ్యగారిని కోరారు.

మూసి, ఇయూసి నదీజలాల పరీవాహక ప్రాంతాల నన్నిటినీ పరిశీలించారు. సంస్థానంలో ఛీఫ్ ఇంజనీర్‌గా వున్న టి. డి. మెకంజీ అనే విదేశీయుడు విశ్వేశ్వరయ్యగారివద్ద పనిచేయటం తనకు గిట్టదన్నాడు. విశ్వేశ్వరయ్య బొంబాయి నుండి విశ్వసనీయులైన కొందరు ఇంజనీర్లను రప్పించు కున్నారు. మూసీ, ఇయూసి నదుల ప్రవాహ పరికోపాన్ని అరికట్టి, హైదరాబాద్ నగరాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మాణం కావించేందుకు పథకాలను సిద్ధంచేశారు. కాని

ప్రభుత్వం పథకం అమలుచేసేందుకు మూడేళ్ళు పట్టింది. 1913 లో మూసీనది ఆనకట్టకు శంకుస్థాపన జరిగింది. ఆ నిర్మాణం పూర్తిఅయ్యేనాటికి విశ్వేశ్వరయ్యగారు మైసూరు దివాన్‌గా ఉన్నారు.

విశ్వేశ్వరయ్యగారు సూచించిన, అనుభవజ్ఞులైన భారతీయ ఇంజనీర్ సి. టి. దలాల్‌గారి పర్యవేక్షణలో జంటనగరాలు రహదార్లు,విద్యుచ్ఛక్తి, ఉద్యానవనాలు, నీటిసరఫరా మొదలైన వాటితో సర్వాంగసుందరంగా రూపొందాయి.

'ఈ కీర్తిప్రతిష్ఠలన్నీ విశ్వేశ్వరయ్యగారికే చెల్లు' అన్నాడు ఒకనాడు విశ్వేశ్వరయ్యగారిని యీసడించుకున్న అహంకారి, సంస్థాన ఛీఫ్ ఇంజనీర్ మెకంజీ.

• • •

మైసూరు సంస్థానంలో

1909 నవంబర్ 15వ తేదీన విశ్వేశ్వరయ్యగారు, మహారాజాగారి కోరిక మేరకు సంస్థాన ప్రధాన ఇంజనీర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1911 లో మహారాజా సంస్థాన అభివృద్ధి మండలికి ప్రారంభోత్సవం చేశారు. సంస్థానాన్ని అర్థికంగా సుసంపన్నం, వైజ్ఞానికంగా ఆధునికం, కావించి, అవిద్య, అనారోగ్యం మున్నగువాటినుండి విముక్తి కావించి ఆదర్శసంస్థానంగా తీర్చిదిద్దాలన్న తమ కలలకు వాస్తవరూపం కల్పించేందుకు కృతనిశ్చయులయ్యారు విశ్వేశ్వరయ్య.

వివిధ శాఖలకు తగిన అధికారుల పేర్లను సూచింపవలసినదిగ విశ్వేశ్వరయ్యగారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కొన్ని పేర్లను సూచించింది. విశ్వేశ్వరయ్య ఆ పట్టికలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యాయోగ్యతలు, కార్యదక్షతలను మాత్రమే ప్రధానంగా పరిగణించి, అధికారులను ఎంపికచేశారు.

మూడేళ్ళపాటు ప్రధాన ఇంజనీర్‌గా విశ్వేశ్వరయ్యగారి సేవలకు సంతృప్తిచెందిన మహారాజా, విశ్వేశ్వరయ్యగారిని దివాన్‌గా నియమించారు.

ఇదివరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు సాగించిన విశ్వేశ్వరయ్యగారు, మైసూరు సంస్థాన దివానుగా స్వతంత్రముగ సేవచేసే అవకాశం లభించింది. దేశ పురోగతికి కృషిచేసే అవకాశం లభించింది. విశ్వేశ్వరయ్య ఏనాడు ధనార్జనకోసం వెంపర్లాడలేదు. ఆంగ్లేయుల జాత్యహంకారం, ఆధిక్యతలను నిరసించారు. భారతీయులు తెల్లవారికంటే తక్కువవారన్న సిద్ధాంతాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

విశ్వేశ్వరయ్యగారి రాకతో మైసూరు సంస్థానానికో క్రొత్త కళ వచ్చింది. నిద్రాముద్రితమైన సంస్థానం జాగృతమైంది.

వారి రాక 'ప్రభంజనంలా పనిచేసింది' అన్నారు ప్రముఖ రచయిత సిద్ధవ్వనహళ్ళి కృష్ణశర్మ. సోమరితనం, జాడ్యం, క్రియాశూన్యత మటుమాయమయ్యాయి.

విధివిలాసం, అంతా దైవనిర్ణయం అనే ఆత్మన్యూనతా భావాన్ని పారద్రోలి ప్రతి ఉద్యోగి తన కర్తవ్యాన్ని దేశాభిమానంతో నిర్వహించేటట్లు చేశారు విశ్వేశ్వరయ్య. విశ్రాంతి నెరుగని కర్మయోగి ఆయన. కొందరు పెద్దలు వారిని 'మీ చివరి కోరిక ఏమి ?' అని ప్రశ్నించారు. 'ఊపిరి వున్నంతకాలం పనిచేస్తూ ఉండాలన్నదే నా ఆశయం' అన్నారు.

• • •

విద్యావ్యాప్తి

విదేశ పర్యటన, అందులో ముఖ్యంగా జపాన్ పర్యటన విశ్వేశ్వరయ్యగారినెంతో ప్రభావితం చేసింది. సంస్థానంలో నిర్బంధ ప్రాథమిక విద్యావిధానాన్ని అమలుపరచారు. విశ్వవిద్యాలయ విద్యార్థులకు నిర్బంధ సైనిక శిక్షణ కావాలన్నారు. వృత్తివిద్యలకు ప్రాధాన్యమిచ్చారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు, అంటరాని విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పించి వారి విద్యాభ్యాసానికి కృషిచేశారు. బాలికల విద్యకు ఎన్నో ప్రోత్సాహక పథకాలు అమలుపరిచారు. మహిళలకోసం కళాశాలలను ప్రారంభింపచేశారు. వారికి విద్యార్థి వేతనాలు, హాస్టల్ వసతులు కల్పించారు.

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులలో శిక్షణకోసం హెబ్బాళ్‌లో వ్యవసాయ కళాశాలను నెలకొల్పారు. వ్యవసాయ పరికరాల ఉత్పత్తికి కర్మాగారాలు ప్రారంభించారు. రైతులకు అధికోత్పత్తి సాధనలో శిక్షణకోసం పెక్కు కేంద్రాలను నెలకొల్పారు.

విద్యార్థులలో సృజనాత్మక శక్తులను పెంపొందించటం విద్యయొక్క లక్ష్యం కావాలంటూ విద్యావిధానంలో సముచితమైన మార్పులు చేశారు.

పెద్ద పట్టణాలలో గ్రంథాలయాలను నెలకొల్పారు. కన్నడ సాహిత్య పరిషత్‌ను ప్రారంభింపచేసి విజ్ఞానదాయకములైన గ్రంథముల ప్రచురణకోసం పెక్కు చర్యలు తీసుకున్నారు.

మైసూరు మహారాజ కాలేజి ప్రిన్సిపల్ మరియు ప్రొఫెసర్ డాక్టర్ సి. ఆర్. రెడ్డిగార్లను పాశ్చాత్య విశ్వవిద్యాలయాల నిర్వహణ, పాఠ్యాంశాలు మున్నగువాటిని పరిశీలించి నివేదిక సమర్పించవలసినదిగా కోరారు. వారి పర్యటనానుభవాల ప్రాతిపదికపై మైసూరు విశ్వవిద్యాలయం అవతరించింది.

కృష్ణరాజసాగర్

మైసూరు నగరానికి 18 కిలోమీటర్ల దూరంలోని కృష్ణరాజ సాగర జలాశయం, బృందావన ఉద్యానవనం మైసూరు సంస్థాన లక్ష్మికి యశోభూషణాలై వెలుగుతున్నాయి. ప్రతిదినమూ వేలాది పర్యాటకుల నాకర్షించు యీ దివ్యనిర్మాణాల శిల్పి మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

రెండు కొండలమధ్య ప్రవహించే నదీజలాలు నిష్ప్రయోజకములు కారాదని విశ్వేశ్వరయ్య సంకల్పించారు. టిప్పు సుల్తాన్ కాలంలోనే యీ ప్రాంతంలో జలాశయాన్ని నిర్మించాలని సంకల్పించినందుకు నిదర్శనంగా అక్కడొక శిలాశాసనం వుంది. కొన్ని వందల సంవత్సరాల నాటి ఆలోచనకు ఆకృతి నిచ్చిన వాస్తు శిల్పి విశ్వేశ్వరయ్య.

సంస్థాన ప్రధాన ఇంజనీర్‌గా వీరు కృష్ణరాజసాగర నిర్మాణానికి సంబంధించిన అంచనాలను సిద్ధపరచి మహారాజా గారికి పంపారు. సంస్థాన వార్షికాదాయం రు. 223 లక్షలు. సాగర నిర్మాణానికి అంచనా రు. 253 లక్షలు. ఈ పథకంతో పాటు రైలుమార్గాల విస్తరణకు అంచనాలు పంపారు. ప్రభుత్వం రైల్వే మార్గ విస్తృతికి అనుమతించింది.

కావేరి జలాలను వ్యవసాయానికేకాక విద్యుచ్ఛక్తి ఉత్పాదనకు కూడా సమకూర్చుకోవాలని విశ్వేశ్వరయ్యగారి ప్రణాళిక. ఆర్థికశాఖ యీ పథకానికి అడ్డుతగిలింది. మహారాజా మౌనంగా ఉన్నారు. ప్రధాన ఇంజనీర్ పదవిని చేపట్టినపుడు తన పథకాలన్నిటికీ సుముఖత చూపిన మహారాజా యిప్పుడు మౌనం వహించడం బాధ కల్గించింది. విశ్వేశ్వరయ్య ఆరు నెలలు సెలవుపై ఉత్తరభారత పర్యటనకు వెళ్ళారు.

సెలవు తర్వాత పదవిలో చేరారు. కాని మొదటవున్నంత ఉత్సాహం వారిలో లేదు. ఏదో యాంత్రికంగా పనులు చేసే వారు. రాజీనామా చేయటమే ఉత్తమమనుకొన్నారు. ఈవార్త మహారాజావారికెట్లో తెలిసింది. విశ్వేశ్వరయ్యగారిని పిలిపించారు. తమ ఆవేదనను మహారాజాగారికి నివేదించారు. కొత్త పథకాలకు సమ్మతించెదమని మహారాజా హామీ యిచ్చారు.

విశ్వేశ్వరయ్య 1912 నవంబర్‌లో మైసూరు సంస్థాన దివాన్ పదవిని చేబట్టారు. కృష్ణరాజసాగర్ నిర్మాణం ప్రారంభమైంది. కావేరీనది పరవళ్లు తొక్కుతూవుంది. కోలారు బంగారు గనుల త్రవ్వకంపని జాన్ టేలర్ కంపెనీకి గుత్తకివ్వబడింది. కంపెనీకి నిర్ణీత స్థాయిలో విద్యుచ్ఛక్తి సరఫరా చేయకున్న మైసూరు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించునట్లు ఒప్పందం. దురదృష్టవశంకొద్ది విద్యుత్ సరఫరా చేయలేనందుకు 38000 పౌండ్లు నష్టపరిహారం కోరింది కంపెని.

ఎన్ని అవాంతరాలు ఎదురైనా కృష్ణరాజసాగర పని పూర్తిచేయాలన్న పట్టుదల పెరిగింది. మద్రాసు ప్రభుత్వం ఆనకట్ట నిర్మాణానికి మడతపేచీ పెట్టింది.

అవాంతరాలు ఎక్కువైనపుడల్లా ధీరులు వాటిని మరింత సాహసంతో, నిర్విరామకృషితో, అపారమైన ఆత్మవిశ్వాసంతో, అనంతమైన సహనంతో ఎదుర్కొని విజయశిఖరాన్ని అధిరోహిస్తారు.

సాగర నిర్మాణంలో పదివేలమంది కూలీలు ఉండేవారు. మరో రెండువేలమందిని నియమించారు. కూలీల ఆరోగ్య రక్షణకోసం మరికొందరు వైద్యులను నియమించారు. భద్రత కోసం పోలీసు కాపలా పెంచారు. ప్రజా ప్రతినిధుల సభ సమావేశాలైన వెంటనే దివాన్‌గారు కృష్ణరాజసాగర నిర్మాణ

పర్యవేక్షణ ప్రారంభించారు. అసమానమైన పట్టుదల వారిది. ఇంజనీర్లను, కార్మికులను ఉత్తేజపరుస్తూ, దేశపురోభివృద్ధికోసం రేయింబవళ్ళు పనిచేయునట్లు పురిగొల్పారు. విశ్వేశ్వరయ్య గారికి అదో 'సవాల్'. ప్రకృతియే వికటించినపుడు మీరు మాత్రం ఏమిచేయగలరన్నారు జాన్‌టేలర్ కంపెనీ పెద్దలు. మొదటి ప్రపంచయుద్ధ కాలమది. విదేశాలనుండి సిమెంట్ దిగుమతికి ఇబ్బంది కలిగింది. భారతదేశంనుండి విదేశాలకు పెద్దగా పైకం పోవటం విశ్వేశ్వరయ్యగారికి ఇష్టంగా వుండేది కాదు. సున్నం, ఇటుకపొడి, ఇసుక వీటిని నిర్దుష్ట ప్రమాణంలో కలిపి 'సుర్కి' గచ్చు తయారీ సాధించారు. కృష్ణరాజసాగర నిర్మాణానికి 'సుర్కి' గచ్చునే వినియోగించారు. ఎనభై ఏళ్ళు దాటినా చెక్కుచెదరకుండా వుందా ఆనకట్ట.

కృష్ణరాజసాగరంలో 48,300 దశలక్ష ఘనపుటడుగుల నీరు నిలువచేయవచ్చు. జలాశయ విస్తీర్ణం 50 చ.మై, పొడవు 8600 అడుగులు, ఎత్తు 140 అడుగులు, నిర్మాణవ్యయం 2 కోట్ల 50 లక్షల రూపాయలు. ఆకాలంలో మనదేశమందలి జలాశయాలన్నిటికంటే ఇదే పెద్దది. 60 మైళ్ళ పొడవుగల కాలువలద్వారా వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్నవీ సాగరజలాలు.

విశ్వేశ్వరయ్య కల ఫలించింది. ఆహారధాన్యాల ఉత్పత్తికేకాక, విద్యుచ్ఛక్తి ఉత్పాదనకు వనరులు సమకూరాయి. కృష్ణరాజసాగరం జల సమృద్ధమై ఉన్నంతకాలం విశ్వేశ్వరయ్యగారి కీర్తిసౌరభాలు పరిమళిస్తూనే వుంటాయి.

• • •

భద్రావతి ఉక్కు కర్మాగారం

భారతదేశంలో మొట్టమొదటి ఉక్కుకర్మాగారం నెలకొల్పిన వాడు జంషెడ్జి తాతా. విశ్వేశ్వరయ్య 'తాతా' కంపెనీ సలహా దారైన, సి. ఇ. పెరిన్‌ను ఆహ్వానించి భద్రావతిలో ఇనుము ఉక్కు కార్ఖానా ప్రారంభించుట వీలున్నదేమో పరిశీలించమని కోరారు. సంస్థానంలోని బాబాబుడన్‌గిరి, కల్లత్‌గిరి, కుద్రేముఖ్ ప్రాంతాల్లో మేలిరకం ఇనుప ఖనిజాలున్నాయని తేలింది.

తాతాకంపెనీకి కర్మాగార స్థాపన, నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. జంషెడ్‌పూర్ ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించిన అమెరికన్ సంస్థ పెరిన్ మార్షల్ కంపెని భద్రావతి కర్మాగార నిర్మాణ కార్యక్రమాన్ని 1917-18 లో ప్రారంభించింది. 1923 నాటికి నిర్మాణం పూర్తి అయింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఉక్కు ధరలు బాగా పడిపోవటంతో కర్మాగారం నష్టాల ఊబిలో కూరుకుపోయింది.

ఈ పరిణామం మహారాజాగారి కెంతో కలవరం కలిగించింది. వెంటనే బొంబాయిలోఉన్న విశ్వేశ్వరయ్యగారిని పిలిపించుకొని, కర్మాగార స్థాపనకు కారకులు మీరే కదా ? అని ప్రశ్నించారు. కర్మాగారంపై సర్వాధికారాలు విశ్వేశ్వరయ్య గారికి అప్పగించారు. అధికారాలన్నీ తన గుప్పెట్లో ఉన్నప్పటికీ, పాలనా మండలి ఏర్పడాలని, వారితో చర్చించిన తర్వాతనే నిర్వహణ బాధ్యతలను స్వీకరిస్తామన్నారు. పాలనామండలి అధ్యక్షులుగా కర్మాగారం ఆదాయ వ్యయాలను క్షుణ్ణంగా తెలుసుకొన్నారు. దుబారా ఖర్చులను తగ్గించారు. అనవసర మైన సిబ్బందిని తొలగించారు. సామాన్యుడైన కూలీ సలహాను కూడా ఆనందంతో ఆమోదించేవారు. కార్మికులలో దేశాభిమానం, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందింపజేశారు. తమ వేతనంలో

రూపాయికి రెండణాలవంతున స్వచ్ఛందంగా తగ్గించుకొన్నారు. విశ్వేశ్వరయ్యగారి ఆదర్శాన్ని తక్కిన ఉద్యోగులు అనుసరించారు. 'మహాజనోయేనగతాః సపంథాః' అన్న సూక్తి వాస్తవమైంది.

ఉక్కు కర్మాగారంలోని అమెరికన్ ఇంజనీర్ గుడ్కో నిర్లక్ష్యంవల్ల భారీ కొలుములు వరదలకు గురిఅయ్యాయి. విశ్వేశ్వరయ్య అతని నిర్లక్ష్య వైఖరికి సంజాయిషీ కోరారు. పెరిన్ మార్షల్ కంపెనీకి గుడ్కో వైఖరిని తెలుపుతూ అతనిని వెనక్కి పిలిపించుకోమని రాశారు. ఒక భారతీయుడు తనను సంజాయిషీ కోరటం అవమానంగా భావించి, గుడ్కో తన పదవికి రాజీనామా చేశాడు. అతని స్థానంలో విశ్వేశ్వరయ్య న్యాపతి మాధవరావును నియమించారు.

భద్రావతి కర్మాగారంలో గుడ్కో కాక మరో పన్నెండు మంది అమెరికన్ ఇంజనీర్లు వుండేవారు. వారికి భారతీయ ఇంజనీర్లకంటే ఎక్కువ వేతనాలు ఉండేవి. జాత్యహంకారులైన, వారు భారతీయ ఇంజనీర్లను అసమర్థులుగా భావించారు. విశ్వేశ్వరయ్య భారతీయ ఇంజనీర్లను ఉత్తేజపరిచారు. కొన్ని నెలల్లోనే విదేశీ ఇంజనీర్లను తొలగించి వారి స్థానాల్లో స్వదేశీయులను నియమించారు. వారిలో కొందరిని ఉన్నత శిక్షణకై విదేశాలకు పంపించారు. కొందరిని జంషెడ్పూర్కు పంపారు. సంస్థాన సివిల్ సర్వీస్కు చెందిన అత్యంత సమర్థులను పాలనాధికారులుగ నియమించారు.

క్రమంగా నష్టాలు పూడ్చుకుపోయాయి. 1924 లో భద్రావతి కర్మాగారం ఉత్పత్తులకు డిమాండ్ బాగా పెరిగింది. బొంబాయి, అహమదాబాద్, కరాచి, మద్రాసు నగరాల్లో విక్రయశాలలు ఏర్పడ్డాయి. కర్మాగారం లాభాలు గడించసాగింది.

విశ్వేశ్వరయ్యగారి సేవలను ప్రశంసిస్తూ " ఆరున్నర ఏళ్ళపాటు మీ సర్వశక్తులను ధారపోసి, భద్రావతి కర్మాగార అభివృద్ధికి మీరొనర్చిన నిర్విరామ సేవలకు మే మెంతగానో హర్షిస్తున్నాము " అని రాశారు మహారాజా.

అలాగే, "భద్రావతి కర్మాగార మండలి అధ్యక్షులుగా మీరు విరమించుకోవాలని నిర్ణయించడం విచారకరం. మీ కార్య దక్షత వల్లనే ఆ కర్మాగారం వృద్ధిచెందింది " అని అమెరికన్ ఇంజనీరింగ్ సంస్థ అధిపతి విశ్వేశ్వరయ్యగారికి జాబు రాశాడు.

కర్మాగారాభివృద్ధికి ఆరున్నరయేళ్ళు శ్రమించిన విశ్వేశ్వరయ్యగారికి, మహారాజా రు. 1,30,000 గౌరవ ధనం యివ్వగా, "ధనార్జనచేసే వయసు చెల్లిపోయింది. సంపాదన పట్ల నాకు ఆశ లేదు, దయచేసి మన్నించండి " అంటూ పారితోషికాన్ని సవినయంగా తిరస్కరించారు. ఆ మొత్తాన్ని పారిశ్రామిక శిక్షణాకేంద్ర స్థాపనకు వినియోగించమని కోరారు. ఆ సంస్థకు విశ్వేశ్వరయ్యగారి పేరు పెట్టనున్నట్లు తెలుపగా 'వద్దు' అంటూ, ఆ సంస్థకు జయచామరాజేంద్ర ఆక్యుపేషనల్ ఇన్‌స్టిట్యూట్ అని నామకరణం చేయవలసినదిగా విన్నవించారు. అలా వెలిసిందే నేటి జయచామరాజేంద్ర ఆక్యుపేషనల్ ఇన్‌స్టిట్యూట్.

1927 లో గాంధీజి విశ్రాంతికోసం మైసూరు వచ్చారు. మైసూరు హైకోర్టులో నివృత్త న్యాయమూర్తి ఒకరు, కృష్ణరాజ సాగర్ నిర్మాణం, భద్రావతి ఉక్కు కర్మాగారం స్థాపనలపట్ల తన వ్యతిరేకతను వెల్లడిస్తూ, తాను లోగడ వివిధ పత్రికలద్వారా చేసిన విమర్శలన్నిటినీ గాంధీజి పరిశీలనకోసం పంపాడు.

తనకు వచ్చిన జాబులన్నిటికీ బదులు రాయటం గాంధీజీ నియమం. విశ్వేశ్వరయ్యగారిపై కురిపించిన విమర్శలను మైసూరు ప్రభుత్వానికి పంపి వాస్తవాలను గాంధీజీ తెలుసు

కొన్నారు. కొందరు పెద్దలతోపాటు గాంధీజీ కృష్ణరాజసాగర్ మరియు భద్రావతి ఉక్కు కర్మాగారాలను దర్శించారు.

" ఈ కర్మాగారాన్ని రేపే మూసివేసినా బాధపడ నక్కరలేదు. భారతీయులు కొత్త కార్ఖానాలను స్వయంగా నెలకొల్పగలరని నిరూపించి, విదేశీయుల కళ్ళు తెరిపించారు" అంటూ విశ్వేశ్వరయ్యగారిని మనసారా అభినందించారు. 'కృష్ణరాజసాగర జలాశయం ప్రపంచమందలి గొప్ప జలాశయాల కేమాత్రం తీసిపోదు' అని అభినందించారు. విశ్వేశ్వరయ్యగారిపట్ల అపోహలు సృష్టింపదలచిన మాజీ న్యాయమూర్తికి శృంగభంగం కలిగింది.

1980-81 లో భద్రావతి ఉక్కు కర్మాగారం రు. 91 కోట్లు గడించింది. 1975 లో విశ్వేశ్వరయ్య స్మృతిచిహ్నంగా ఆ కర్మాగారాన్ని విశ్వేశ్వరయ్యగారికి అంకితం చేశారు.

• • •

ఆర్థికాభివృద్ధి

ఆధునిక యుగంలో ఏ దేశంకూడా కేవలం వ్యవసాయం వల్లనే ఆర్థిక పుష్టిని సంపాదించుకోజాలదు. పారిశ్రామికీకరణ అత్యవసరం అని ఆయన విశ్వాసం.

మన దేశంలో పంచవార్షిక ప్రణాళికలకు పునాదులువేసిన మహనీయులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య. 1911 లోనే వారు ప్రణాళికల అవసరాన్ని చాటిచెప్పారు. కుటీర పరిశ్రమలు, భారీ మధ్యతరహా పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, మోటారు వాహనాలు, నౌకల నిర్మాణం, నూలుమిల్లులు నెలకొల్పటం అవసరమన్నారు. ఆరోజుల్లో నిత్యావసరాలైన కాగితం, పెన్సిల్, సబ్బు, సూది, గాజు సామానులు, మందులు వగైరా లన్నిటినీ విదేశాలనుండి దిగుమతి చేసుకొనేవారు. అన్ని రంగాలలోను భారతదేశం స్వయంపోషకం కావాలని విశ్వేశ్వరయ్యగారి అభిలాష.

"మనవారు సహజంగా అలసత్వానికి అలవాటుపడినవారు. పాశ్చాత్యదేశాలతో పోల్చినపుడు మనదేశంలో సెలవులు ఎక్కువ. 'అంతా విధిలిఖితం' అనే అకర్మ సిద్ధాంతం దేశపురోభివృద్ధికి ప్రధానమైన అవరోధం" అనేవారాయన.

1915 లో మైసూరు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారు. భారతదేశంలో స్వదేశ సంస్థానాలలో వెలసిన మొదటి విశ్వవిద్యాలయమిది. 1916 లో కన్నడ సాహిత్య పరిషత్తును, ఛేంబర్ ఆఫ్ కామర్స్, సెంచురి క్లబ్, పెద్ద ముద్రణాలయం, ఆధునిక హోటెళ్ళు, పట్టుపరిశ్రమ, సుగంధ తైలాల కర్మాగారం మొదలైనవాటి నెన్నిటినో వారు ప్రారంభించారు. ఆధునిక విజ్ఞానశాస్త్ర సహాయంతో దేశ సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నది వారి జీవిత లక్ష్యం.

భారతదేశ భవితవ్యానికి వారిచ్చిన సందేశం "పారిశ్రామికీకరణ లేదా పతనం".

• • •

సాంఘిక చైతన్యం

మైసూరు సంస్థాన దివాను పదవీ బాధ్యతలను చేపట్టినప్పటి నుండి బీద, వెనుకబడిన వర్గాలు, దళిత వర్గాల శ్రేయస్సు కోసం వారెన్నో పథకాలను అమలుచేశారు.

విశ్వేశ్వరయ్యగారు సహపంక్తిభోజనాలను ఏర్పాటు చేశారు. అస్పృశ్యతా నివారణకోసం, "సివిల్ అండ్ సోషల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్" స్థాపించారు. హరిజనబాలబాలికల విద్యాభ్యాసానికి కొత్తగా పాఠశాలలు, వసతిగృహాలు, ఆర్థిక సహాయం కల్పించారు. బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలను స్థాపించారు. ఆ పాఠశాలల్లో మహిళలనే ఉపాధ్యాయులుగ నియమించునట్లు ఆదేశించారు.

రైళ్లు, మోటార్లు, హోటెళ్లు, సినిమాలు మున్నగు ఆధునిక జీవిత సౌకర్యాలను సామాన్యులుకూడా అనుభవించాలని వారి ధ్యేయం.

బాల్యవివాహాలను, బాలవితంతువులకు శిరోముండనము చేసి వారిని విరూపులుగ చేయటాన్ని ఖండించారు.

గ్రామాలు పరిశుభ్రంగా వుంచాలని, గ్రామప్రజల ఆరోగ్యం కాపాడాలని వారి ఆశయం. దేవాలయాలను, తదితర ప్రజానీకం చేరే స్థలాలను పరిశుభ్రంగా వుంచాలన్నారు,

రాజీనామా

ప్రభుత్వోద్యోగాలకు అభ్యర్థులను ఎంపికచేసే విధానంలో మహారాజాగారికి విశ్వేశ్వరయ్యగారికి అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి. అభ్యర్థి ప్రతిభకు, కార్యదక్షతకు ప్రాధాన్య మివ్వాలని విశ్వేశ్వరయ్య పట్టుపట్టారు. మహారాజాగారు ఆశ్రితులపట్ల పక్షపాతం ప్రకటించారు.

రెవెన్యూ శాఖలో అభ్యర్థులను ఎంపికచేయవలసి వచ్చింది. మూడవ వంతు స్థానాలను వెనుకబడిన తరగతులకు రిజర్వుచేయాలని రాజాగారి కోరిక. అర్హులైనవారు ఇతర వర్గాలలోవున్న పక్షంలో, వారికి మరికొన్ని ఉద్యోగాలు కల్పించాలని దివానుగారు విన్నవించారు.

వెనుకబడిన తరగతులవారికి విద్యా సౌకర్యాలను, ఉద్యోగావకాశాలను తప్పక కల్పించాలన్నదే విశ్వేశ్వరయ్యగారి ఆశయం. ప్రభుత్వ పాలనలో దక్షత, సామర్థ్యం లోపించిన ప్రభుత్వానికే దెబ్బ అని విశ్వేశ్వరయ్య నమ్మకం.

అంతేకాదు ప్రజాప్రతినిధుల సభకు మరిన్ని అధికారాలు పెంచటం కూడా మహారాజాగారికి రుచించలేదు.

మహారాజాగారిని నేరుగా కలుసుకొనే అవకాశాలు ఉండేవి కావు. మహారాజాగారి ఆంతరంగిక కార్యదర్శిద్వారా పత్ర వ్యవహారం సాగుతుండేది. అసంతృప్తి వున్నప్పటికీ, దివాన్‌గారి చిత్తశుద్ధిని శంకించలేదు. వారి సేవలకు మెచ్చిన మహారాజాగారు విశ్వేశ్వరయ్యగారి నెలసరి వేతనాన్ని రు. 4 వేలనుండి రు. 5 వేలకు పెంచుతున్నట్లు 1918 మార్చి 12 వ తేదీన ఉత్తర్వులు పంపారు.

చివరకు వారిద్దరిమధ్య అభిప్రాయ భేదాలు పెరిగాయి. 'నా సమాధానాలు తమకు అంగీకారం కానిఎడల నేను పదవీ విరమణ చేయక తప్పదు. మన్నించగలరు ' అని రాశారు విశ్వేశ్వరయ్య.

సంస్థానంలో కారుచీకట్లు కమ్ముకొంటున్న సమయంలో, భారత ప్రభుత్వం, మైసూరు సంస్థానంలో 260 మైళ్ళ రైలు మార్గం నిర్మించేందుకు అనుమతి నిచ్చింది. అదంతా విశ్వేశ్వరయ్యగారి కృషి ఫలితమే,

ఆత్మగౌరవం కారణంగా రాజీనామా లేఖను పంపించినా, చేపట్టిన పథకాలు అర్ధాంతరంగా నిలిచిపోగలవేమోనన్న సంశయం కలిగింది. దివాన్ పదవినుండి వైదొలగినా అమలులో నున్న పథకాలను పూర్తిచేయుటకు తన సేవలను అందించ నున్నట్లు తెలిపారు. మంత్రిమండలిలో గౌరవ సభ్యునిగా నియమించి, ప్రయాణ ఖర్చుల నిమిత్తం నెలకు రు. 300/-లు, సహాయకుడిగ ఒక ఇంజనీర్‌ను సమకూర్చిన చాలునని నివేదించారు. తమ వేతనాన్ని 5 వేలకు పెంచవద్దు అని విన్నవించారు. ఇది వారి దేశభక్తిని సేవాతత్పరతను నిరూపిస్తుంది. కాని మహారాజాగారికి సమ్మతం కాలేదు.

రాజీనామాను ఆమోదించవలసినదిగా మహారాజాగారిని కోరారు. తాము చేపట్టిన పథకాలను పూర్తిచేసే అవకాశం కోల్పోతున్నందుకు విచారిస్తూ, మరోమారు తనను పదవీబాధ్యతల నుండి విముక్తునిచేయమని కోరారు. 1918 డిసెంబర్ 9వ తేదీన మహారాజాగారు వీరి రాజీనామాకు అంగీకారం తెలిపారు.

కచ్చేరి పనులన్నీ ముగించారు. పదవీ బాధ్యతలను అప్పగించి, ఉన్నతాధికారులందరినీ రప్పించి, వారి సహకారానికి కృతజ్ఞతలు చెబుతూ, రాజీనామా కారణాలను వెల్లడించ

కుండా, ప్రశాంతచిత్తులై సెలవు తీసుకున్నారు. పుట్టినగడ్డ ప్రగతికి మరింత సేవచేసే అవకాశం కోల్పోతున్నందుకు లోలోన మథన పడుతున్నా, నిబ్బరంగా 'ధన్యవాదాలు' ధన్యవాదాలు అంటూ నిష్క్రమిస్తూ బయట సిద్ధంగావున్న సొంతకారులో వెళ్ళిపోయారు.

'ఇనుము వలె తుప్పుపట్టి నాశనం కావద్దు. శ్రీగంధం చెక్కలా అరగిపోతూ సేవాసౌరభాలను పంచిపెట్టు' అన్నదే వారి ధ్యేయం.

"విశ్వేశ్వరయ్యగారు పదవీబాధ్యతలను స్వీకరించినది మొదలు అవిశ్రాంతంగా దేశ ఆర్థికాభివృద్ధి యనే ఏకైక లక్ష్యంతో సేవచేశారు. దివానుగా వారు వ్యవసాయం, నీటిపారుదల, విద్యాభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి, రైలుమార్గాల విస్తృతి మున్నగు రంగాలలో గొప్ప కృషిచేసి సంస్థాన ఆర్థిక ప్రగతికి, సుస్థిరతకు అనన్యంగా కృషిచేశారు" అంటూ మైసూరు ప్రభుత్వం ప్రత్యేక రాజపత్రం ప్రకటించింది.

• • •

స్వదేశాభిమానం

భారతదేశాన్ని నవనాగరికదేశంగా రూపొందించాలని ఆశించారు విశ్వేశ్వరయ్యగారు. ఆ ఉద్దేశంతోనే ఆరుసార్లు వారు విదేశాల్లో పర్యటించి అచ్చటి ఆర్థిక ప్రణాళిక లన్నిటినీ అధ్యయనం చేశారు.

ఒక దేశం నాగరికత, ఆ దేశ ప్రజలు వినియోగించుకునే విద్యుచ్ఛక్తి, పెట్రోల్, వాహనాల సంఖ్యనుబట్టి నిర్ణయించ వచ్చని ఆర్థికశాస్త్రవేత్తలంటారు. విశ్వేశ్వరయ్యగారి కాలంలో విద్యుదుత్పాదక యంత్రాలు, వాహనాలు, పెట్రోలు మున్నగు వాటిని దిగుమతి చేసుకునేవారు. కోట్లాది రూపాయలు విదేశాలకు తరలిపోవటాన్ని అరికట్టాలని, స్వదేశంలోనే మోటారు వాహనాలను తయారుచేయాలని సంకల్పించారాయన. ఆ దృష్టితోనే అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లోని ప్రముఖ మోటార్ వాహనాల కర్మాగారాలను దర్శించి సాంకేతిక విషయాలను సేకరించారు. ఇంగ్లండు లేదా అమెరికా సహకారంతో ఏటా పదివేల మోటర్ కార్లను, ఐదువేల ట్రక్కులను తయారుచేసే పథకాన్ని సిద్ధపరిచారు. మన దేశంలో ఒక కారు ఉత్పత్తి ఖర్చు ఆనాడు రు. 1420/- మాత్రమే. విదేశీ కారు వెల రు. 3200 ఉండేది.

ఏది ఎట్లున్నా మైసూరు ప్రభుత్వం స్వతంత్రంగా మోటార్‌కార్ల ఉత్పత్తికి పూనుకొనే వీలుండేది కాదు. భారత ప్రభుత్వ అనుమతి లేనిదే ఏ భారీ పరిశ్రమనైనా నెలకొల్పే వీలులేని కాలమది.

ఏడేళ్ళపాటు విశ్వేశ్వరయ్య, వారి తర్వాత వచ్చిన దివాన్ మిర్జా ఇస్మాయిల్‌గార్లు భారత ప్రభుత్వంతో మోటార్

కార్ల ఉత్పత్తికై, కర్మాగార స్థాపనకోసం పత్ర వ్యవహారం సాగించారు. 1908 లో విశ్వేశ్వరయ్య తలపెట్టిన పథకం 40 ఏళ్ళ తర్వాత 'ప్రీమియర్ ఆటొమొబైల్ కంపెని' రూపంలో — కెస్లర్ కంపెనీ సహకారంతో రూపుదాల్చింది.

రెండవ ప్రపంచయుద్ధం బ్రిటిష్ ప్రభుత్వానికి జీవన్మరణ సమస్యగా పరిణమించింది. ఒకనాడు మోటార్‌కార్ల కర్మాగారానికి అనుమతించని ఆంగ్ల ప్రభుత్వం విమాన కర్మాగార స్థాపనకు ప్రోత్సహించటం ఆశ్చర్యకరం. బ్రిటిష్ ప్రభుత్వానికి గత్యంతరంలేని పరిస్థితులేర్పడ్డాయి.

విధి లేక విశాఖపట్నంలో నౌకా నిర్మాణానికి వాల్‌చంద్ హరాచంద్‌గారిని బ్రిటిష్ ప్రభుత్వం ప్రోత్సహించింది. విశాఖపట్నంరేవు చాల లోతైనది. అంత లోతున్న రేవులో నౌకా నిర్మాణం కష్టం. హరాచంద్ విశ్వేశ్వరయ్యగారి సలహా కోరారు. సిమెంట్ బస్తాలతోనిండిన పడవలను రేవు ప్రాంతంలో ముంచివేయమని సూచించారు. అందువల్ల అడుగు భద్రం కాగలదని, ఆ తర్వాత కట్ట నిర్మింపవచ్చునని తెలిపారు విశ్వేశ్వరయ్య.

నౌకలకంటే విమానాల తయారి అత్యవసరమైంది బ్రిటిష్ ప్రభుత్వానికి. హరాచంద్ కంపెనీకి చెందిన ఎం. హెచ్. షా నౌకా నిర్మాణ బాధ్యతలు చూసుకోసాగాడు. బొంబాయిలోనే విమాన కర్మాగారం స్థాపించాలని బ్రిటిష్ ప్రభుత్వం ఆలోచించింది. కాని యుద్ధతంత్రరీత్యా బొంబాయిలో విమాన కర్మాగారం స్థాపించటం మంచిది కాదన్నారు విశ్వేశ్వరయ్య. తమ అభిప్రాయాన్ని భారత ప్రభుత్వానికి తెలిపారు. వారి సలహామేరకు బెంగళూరులో విమాన కర్మాగారం నెలకొల్పబడింది. మైసూరు దివాన్ మిర్జా ఇస్మాయిల్ అందుకు కావలసిన స్థలం, విద్యుచ్ఛక్తి, నీరు వగైరాలను సమకూర్చుటకు సమ్మతించారు.

బెంగళూరులో ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన 'హిందుస్తాన్ ఏరోనాటిక్ ఫ్యాక్టరి' వెలిసింది. విశ్వేశ్వరయ్య గారి సలహా మేరకు నిర్మాణం జరిగింది. వారు ప్రతి శనివారం సాయంకాలం ముందుగా తామే ఫోన్ చేసి, ఫ్యాక్టరి నిర్మాణ కార్యక్రమాన్ని గురించి చర్చించేవారు. ఈవిధంగా మనదేశంలో ఉక్కు ఉత్పత్తి, నౌకా, విమానాల ఉత్పత్తి ప్రారంభించడానికి దీక్షతో పని చేశారాయన.

● ● ●

మహోన్నత వ్యక్తిత్వం

"నా అభిప్రాయాలు ఎలా ఉన్నా, మీ సహకారం సదా లభించే అదృష్టానికి నోచుకొన్నందుకు సంతోషిస్తాను. నా అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యతిరేకించినా, మీ శక్తి సామర్థ్యాలు, దేశభక్తిపట్ల నాకున్న గౌరవం ఏనాటికీ తరగదు" అని గాంధీజీ విశ్వేశ్వరయ్యగారికి జాబు రాశారు.

దృక్పథాలు వేరైనా దేశప్రగతికోసం అంకితమైన మహనీయులు గాంధీజీ, విశ్వేశ్వరయ్యగారలు. నిరంతర క్రియాశీలురై, సత్యాన్వేషకులై, ఎవరెస్టు శిఖరంలా ఎదిగిన కర్మయోగులు. ఇరువురూ 'స్వదేశీ' భక్తులు. గాంధీజీ, కుటీర పరిశ్రమలద్వారా గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచవచ్చునని విశ్వసించారు. పెద్దగా పెట్టుబడులు ఉండవు కాన శోషణకు తావు ఉండదని గాంధీజీ అభిప్రాయం.

కేవలం గ్రామీణ పరిశ్రమలవల్లనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యంకాదని, భారీ పరిశ్రమలద్వారా చిన్న పరిశ్రమలను పెంపొందింపగలమని విశ్వేశ్వరయ్యగారి విశ్వాసం. స్వదేశీ వస్తువులపై ఆయనకెంతో అభిమానం. కాని ఆయన నాణ్యతకు ప్రాధాన్యమిచ్చేవారు..

యంత్రాలద్వారా వేలాది జనుల శ్రమశక్తిని యజమాని దోచుకొంటాడని, యంత్ర పరిశ్రమ ఆర్థిక కేంద్రీకరణకు సాధనం అని, మనిషిని తన సేవకునిగా మార్చివేస్తుందని గాంధీజీ అనేవారు. యంత్రాలు ప్రమాద కారకాలు కూడా అని వారి ఉద్దేశ్యం.

రాట్నం గాంధీజీ ఆర్థిక విధానానికి సంకేతం. మోటర్ వాహనం విశ్వేశ్వరయ్యగారి ఆర్థిక విధానాలకు సంకేతం. ఒకరు సత్యాహింసల వైశిష్ట్యాన్ని ప్రపంచానికి చాటితే, మరొకరు పరిశ్రమలు, ఆనకట్టలు నిర్మించి ప్రజానీకానికి అన్నవస్త్రాలు సమకూర్చి బీదరికాన్ని నిర్మూలింపవచ్చునన్నారు.

దేశం అన్ని విధాలా స్వయంపోషకం కావాలని, దేశ రక్షణావసరాలకు కావలసిన ఆయుధాలు, యితర సామగ్రి భారతదేశంలోనే ఉత్పత్తి చేసుకోవాలనేవారు విశ్వేశ్వరయ్య.

'తాము దేశ ప్రజలకు పెన్నిధివంటివారు. ప్రజాహితం, దేశహితం కాంక్షించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి, తరచు ఉపవాసదీక్షలవల్ల తమ ఆరోగ్యానికి భంగం కలుగవచ్చు' అని విశ్వేశ్వరయ్య గాంధీజీకి రాస్తుండేవారు. ఏనాడూ విశ్వేశ్వరయ్య గాంధీజీ అభిప్రాయాలను బహిరంగంగా విమర్శించలేదు. గాంధీజీకంటే విశ్వేశ్వరయ్య పదేళ్ళు పెద్దవారు.

1937 లో ఒరిస్సాలోని మహానది వరదలవల్ల అపారమైన ఆస్తి నష్టం జరిగింది. ఆ వరదల నిరోధానికి తగు సూచన లివ్వవలసిందిగా గాంధీజీ సూచించిన వెంటనే, డెబ్భైఆరేళ్ళ విశ్వేశ్వరయ్య, స్వయంగా వెళ్ళారు. మహానదీ పరివాహక ప్రాంతమంతటినీ పరిశీలించి సముచితమైన పథకాన్ని సూచించారు. ఒరిస్సా ప్రభుత్వం ఆ పథకాన్ని అమలుచేసింది. రాష్ట్రప్రభుత్వం పంపిన గౌరవ ధనాన్ని తిప్పిపంపుతూ, గాంధీజీ ఆదేశం మేరకు తన సేవలందించానన్నారు. గాంధీజీ పట్ల ఆయనకున్న గౌరవమది.

1947 లో గాంధీజీ ఢిల్లీలోని బిర్లా భవనంలో వుండేవారు. విశ్వేశ్వరయ్య సొంత పనిపై ఢిల్లీ వెళ్లారు. దేశరాజకీయాల భవితవ్యం గురించి ముమ్మరంగా చర్చలు జరుగుతున్న కాలమది. స్వదేశీ సంస్థానాధిపతులు, వారి సలహాదారులు బిర్లా భవన్‌లో గాంధీజి దర్శనానికై వేచివున్నారు. గాంధీజీ నిరాడంబరంగా నేలపై పరచిన తివాసీపై కూర్చుని వచ్చిన వారితో మాట్లాడుతూ వున్నారు. విశ్వేశ్వరయ్యగారు భవనం వద్దకు వచ్చారు. ముందుగా దర్శనంకోసం అనుమతి కోరనందున,

ప్రవేశద్వారంవద్దవున్న వారిని కలుసుకొన్నారు. గాంధీజీకి తమ నమస్కారాలు తెలుపమన్నారు. ఇక వెళ్ళటానికి సిద్ధమయ్యారు. లోపలవున్న పెద్దలొకరు విశ్వేశ్వరయ్యగారి రాకను గురించి గాంధీజీకి తెలిపారు. వెంటనే గాంధీజీ, విశ్వేశ్వరయ్య గారిని ఆహ్వానించమన్నారు. లోపల కుర్చీ తెప్పించి వేయమన్నారు. విశ్వేశ్వరయ్య లోపలికి వస్తున్నట్లే నిల్చొని సాదరంగా ఆహ్వానించి కుర్చీలో కూర్చోమన్నారు. వయోవృద్ధులైన తాము (87 సం॥లు) కింద కూర్చొనటం కష్టం అని కూర్చుండజేశారు. యోగక్షేమాలు విచారించిన తర్వాత బయటి ద్వారం దాకా విశ్వేశ్వరయ్యగారితో వచ్చి వీడ్కోలు పలికారు. వారిద్దరి దృక్పథాలు వేరైనా వారి లక్ష్యం ఒకటే. మహనీయులు అలా వుంటారు.

• • •

గంగావారధి

విశ్వేశ్వరయ్యగారి సేవలు దేశమంతటా విస్తరించాయి. ముఖ్యంగా నీటిపారుదల, నగరాభివృద్ధి, పరిశ్రమల స్థాపనవంటి రంగాలలో వారి కృషి అగ్రగణ్యమైనది. బొంబాయి, బరోడా, భోపాల్, హైదరాబాద్, గ్వాలియర్, ఇండోర్, భావనగర్, సాంగ్లి, అక్కలకోట, కొల్హాపుర్ మున్నగు సంస్థానాల్లోను; కరాచి, సుక్కూర్, సూరత్, నాసిక్, పండరాపుర్, గోవా, ఏడెన్ హైదరాబాద్ మొదలగు పెక్కు నగరాల అభివృద్ధి కార్యక్రమా ల్లోను; గంగా, సింధు, కావేరి, మహానది, తుంగభద్ర మున్నగు నదుల జలాలను ప్రయోజనకరంగా ఉపయోగించుటలోను వారు చేసిన కృషి అనన్యమైనది.

భారతీయులు అత్యంత పవిత్రంగా భావించు గంగానది వేయి మైళ్ళకు పైగా ప్రవహిస్తూ కలకత్తా సమీపంలో బంగాళాఖాతం చేరుతుంది. వర్షాకాలంలో గంగానదీ ప్రవాహం భీకరంగా ఉంటుంది. వరదల భీభత్సం అలవికానిదిగా ఉంటుంది. 1907 లో బీహార్ రాజధాని పాట్నా సమీపంలో వంతెన నిర్మించా లనుకొన్నారు. ఆర్థిక వనరుల లోపం కారణంగా ఆ పని వాయిదా పడింది. 1945 లో మొఖామే వద్ద గంగానదిపై వంతెన నిర్మించాలని రైల్వేబోర్డు నిశ్చయించింది. వ్యయం విషయం ఎట్లున్నా వంతెన ఎక్కడ నిర్మించాలన్న విషయంపై భిన్నాభిప్రాయాలు తలయెత్తాయి. నిష్పాక్షికంగా సమస్యలను కూలంకషంగా చర్చించి నివేదికను సిద్ధపరచగలవారు విశ్వేశ్వరయ్య ఒక్కరే అని నెహ్రూ నిశ్చయించారు. అప్పటికి విశ్వేశ్వరయ్యగారి వయసు 91 సంవత్సరాలు. రైల్వే-రహదార్ల శాఖ మంత్రి గోపాలస్వామి అయ్యంగార్ 1952 జనవరి 7 వ తేదిన విశ్వేశ్వరయ్యగారి సలహా కోరుతూ లేఖ వ్రాశారు.

తొంభై ఏళ్లు దాటిన వృద్ధ యువకుడు విశ్వేశ్వరయ్య. భారత ప్రధాని ఆదేశాలను పాటించడం తన కర్తవ్యమని భావించి వెంటనే తమ సమ్మతి తెలిపారు. వంతెన నిర్మాణ విషయంలో తనకు సహాయకులుగ బి.సి. బైజాల్, బి.బి. వర్మ, వి. పి. భండారి, పి. బి. అద్వాని గార్లను నియమించమని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమితి కార్యదర్శిగ బైజాల్‌గారిని నియమించారు. సమితి కార్యక్రమాలకు, పర్యవేక్షణకు ఒక రైలుబండి, నదిపై ఎత్తునుండి పరిశీలించుటకు విమానం, మున్నగు ఏర్పాట్లు చేయబడినాయి.

1952 మార్చి 27 న సమితి సమావేశం జరిగింది. పాట్నా నుండి కలకత్తా—ఖట్మండూ మున్నగు చోట్లకు వెళ్ళి, ఆ యా చోట్ల ఇంజనీర్లు ప్రజాసంస్థలు, అధికారుల సూచనలను సేకరించారు. భారత సర్వసేనాధిపతి జనరల్ తిమ్మయ్య, జనరల్ థొరాత్‌గార్ల సలహాలను స్వీకరించి దేశరక్షణ దృష్ట్యా వంతెన ఎక్కడ నిర్మించాలన్న విషయం చర్చించారు.

బీహార్ గవర్నర్ ఎం. ఎస్. అణే, విశ్వేశ్వరయ్యగారిని విందుకు ఆహ్వానించారు. ఆహ్వానం తమ కొక్కరికి మాత్రమే పరిమితమైనట్లు తెలిసిన వెంటనే తమ అసమ్మతిని తెలిపారు. రైలుపెట్టెలోనే ఆ రోజంతా పనిసాగించుటకు తీర్మానించు కొన్నారు. గవర్నర్ తన పొరపాటును గ్రహించి విశ్వేశ్వరయ్య గారినే కాక సలహా సమితి సభ్యులందరినీ ఆహ్వానించిన తర్వాత విశ్వేశ్వరయ్య విందులో పాల్గొన్నారు. వయోవృద్ధుల కర్తవ్య నిష్ఠ, సహచరుల గౌరవం కాపాడుటలోగల విశ్వేశ్వరయ్యగారి భావాలను ప్రశంసిస్తూ గవర్నర్ రాష్ట్రపతికో లేఖ రాశారు,

వృద్ధాప్య అడ్డువస్తున్నా, వంతెన నిర్మాణ విషయంలో అన్ని అంశాలను సవివరంగా పరిశీలించి తమ నిర్ణయం ప్రభుత్వానికి తెలిపారు. తనతో సహకరించిన ఇంజనీర్లందరికి తన దస్తూరితో కృతజ్ఞతలు తెలిపారు. 'మొఖామే' వద్ద వంతెన నిర్మించునట్లు సూచించారు.

కేంద్రమంత్రిమండలి విశ్వేశ్వరయ్యగారి సూచనలన్నింటిని యథాతథంగా ఆమోదించి, తమ కృతజ్ఞతను ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా టెండర్లు పిలవాలన్న విశ్వేశ్వరయ్యగారి సూచనను ఆమోదించింది ప్రభుత్వం.

1953 లో ప్రారంభమైన వంతెన నిర్మాణం ఆరేళ్ళలో పూర్తి అయింది. అందుకు 13 కోట్ల 96 లక్షలు ఖర్చయింది.

* * *

తుంగభద్రా ప్రాజెక్టు

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడకముందు బళ్ళారి జిల్లా అవిభక్త మద్రాసు రాష్ట్రంలో ఉండేది. మద్రాసు-హైదరాబాద్ ప్రాంతాల సరిహద్దులలో ఉన్న తుంగభద్ర నదీ జలాలు, వ్యవసాయోత్పత్తికి వినియోగించుకోవాలన్న ఆలోచన 1892 నుండి మెదలుతూ వుండేది. 1947 లో మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి భక్తవత్సలం హైదరాబాద్ సంస్థాన ముఖ్యమంత్రి సర్ మిర్జా ఇస్మాయల్‌గార్లు సమావేశమై అన్ని విషయాలను చర్చించి నిర్మాణ విషయంలో విశ్వేశ్వరయ్యగారి సలహా తీసుకొని ప్రాజెక్టు నిర్మాణం కావించారు.

• • •

బొంబాయి నగరం

నానాటికీ పెరుగుతున్న బొంబాయి నగరాన్ని విస్తృత పరిచేందుకు ప్రయత్నాలు చేశారు. ఒకవైపు సముద్రం, తక్కిన రెండువైపులా కొండలు, గుట్టలు, జవుగులు. 1911 లో జవుగు ప్రాంతాన్ని మట్టిరాళ్ళతో నింపి, ఆ ప్రాంతంలో పెద్ద కట్టడాలు నిర్మింప నిశ్చయించారు. ఆ విధంగా 90 వేల చదరపు గజాల స్థలాన్ని వాసయోగ్యంకావించారు. ఆ విధంగానే మరో 1145 ఎకరాల స్థలాన్ని వాసయోగ్యంగా మార్చేందుకు సర్ జార్జి బుకానన్ నేతృత్వంలో పని ప్రారంభించారు. బుకానన్ కోరినంత పైకం మంజూరైంది. అంచనాలనుమించి పైకం ఖర్చు చేయబడింది. బుకానిన్ వ్యవహారాన్ని పరిశీలించుటకు ప్రభుత్వం ఒక దర్యాప్తు సంఘాన్ని నియమించింది. విశ్వేశ్వరయ్యగారిని అందులో సభ్యులుగా నియమించారు. విశ్వేశ్వరయ్య బుకానిన్ అవినీతి పనులన్నిటినీ రట్టుచేశారు. ఈ వ్యవహారమంతా 'బ్యాక్ బే రిక్లమేషన్' అని ప్రసిద్ధమైంది.

1924 లో, సర్దార్ వల్లభభాయిపటేల్‌గారి సోదరులు విఠలభాయ్‌పటేల్ బొంబాయి నగర కార్పొరేషన్ అధ్యక్షులు. వారు విశ్వేశ్వరయ్యగారిని కార్పొరేషన్ సలహాదారుగ ఎన్నుకొన్నారు. బొంబాయి నగర కార్పొరేషన్ ఆదాయం పెంచుటకు, నగర పాలనలో మరింత దక్షతను కల్గించుటకు విశ్వేశ్వరయ్యగారు గట్టి కృషిచేశారు.

కేంద్ర ప్రభుత్వం నియమించిన దేశ ఆర్థిక స్థితిగతుల విచారణా సంఘం అధ్యక్షులుగ 1924 లో పనిచేశారు. 1929 లో తిరువాన్కూర్‌లో జరిగిన దక్షిణ భారత సంస్థానాల ప్రజల సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. తాతా ఇనుము, ఉక్కు కర్మాగార సంస్థ, బెంగళూరులోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ సంస్థ వంటి దేశంలోని ప్రముఖ సంస్థలలో సలహా

సభ్యులుగ దేశ ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి కృషిచేశారు. ఇండియన్ సైన్సు కాంగ్రెస్‌కు (1923) అధ్యక్షత వహించారు. భారత ఉత్పత్తిదారుల సమాఖ్య స్థాపకులలో ఒకరైన విశ్వేశ్వరయ్య జీవితాంతం ఆ సంస్థ అధ్యక్షులుగా పనిచేశారు.

విశ్వేశ్వరయ్య బొంబాయి రాష్ట్రంలో ఇంజనీర్‌గా 14 ఏళ్ళు పూనా నగరంలో పనిచేశారు. జాతీయ నాయకులైన లోకమాన్య బాలగంగాధరతిలక్, గోపాలకృష్ణ గోఖలే, మహదేవ గోవింద రానడే (బొంబాయి హైకోర్టు న్యాయమూర్తి) గార్లతో సన్నిహిత సంబంధాలు పెంచుకున్నారు.

రానడే, విశ్వేశ్వరయ్య తరచుగా కలుసుకొని దేశ సమస్యలను చర్చించుకునేవారు. ఒకనాడు రానడే, విశ్వేశ్వరయ్యగారితో మాట్లాడుతూ, 'ప్రక్కనున్న ఈ గదిలో భయంకర వ్యాధిపీడితు డొకడున్నాడు–చూస్తారా ?' అంటూ అటువైపు చూపారు. అతడు పక్షవాత రోగగ్రస్తుడు. "చూచారు కదా, మనదేశాన్ని పీడిస్తున్న తీవ్రవ్యాధి ఇదే !" అన్న రానడేగారి మాటలు విశ్వేశ్వరయ్యగారి హృదయానికి హత్తుకున్నాయి. మాతృదేశాన్ని ఆ రోగంనుండి కాపాడాలని నిశ్చయించారు. బాల్యంలో, యవ్వనంలో, కుటుంబ జీవితంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని అచంచల దీక్షతో, నిరక్షరాస్యతా నిర్మూలన, అస్పృశ్యతా నివారణవంటి కార్యక్రమాలను రూపొందించుటతోపాటు దేశ పారిశ్రామిక, ఆర్థిక వికాసానికి జీవితం అంకితంచేసిన కర్మయోగి విశ్వేశ్వరయ్య,

ఆదర్శమూర్తి

1961 సెప్టెంబర్ 15 వ తేదీన భారతదేశం విశ్వేశ్వరయ్య జన్మ శతాబ్ది ఉత్సవం జరిపింది. బెంగళూరు నగరంలోని లాల్‌బాగ్‌లో జరిగిన యీ మహోత్సవానికి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విచ్చేశారు. అల్లుడు ఫిరోజ్‌గాంధి చనిపోయి నాలుగు రోజులైనా కాలేదు. అయినా విశ్వేశ్వరయ్య గారి పట్ల ప్రధానికున్న గౌరవభావంతో బెంగళూరువచ్చి భారత వృద్ధ పితామహుని సేవలను కొనియాడుతూ "తాము తమ కలలకు జీవితంలో ఆచరణరూపం కల్పించారు. సదా దేశ పురోగతిని కాంక్షిస్తూ మీరు మాకు ఆదర్శపంతులయ్యారు. కర్మయోగులు మీరు" అని ప్రస్తుతించారు. ఉత్సవానికి అధ్యక్షత వహించిన మైసూరు రాజప్రముఖ్, జయచామరాజ వడెయర్ విశ్వేశ్వరయ్య మైసూరుకే కాక, భారతదేశానికంతటికీ అందించిన విశిష్ట సేవలను ఉగ్గడించారు.

• • •

సత్కారాలు

1911 లో బ్రిటీష్ ప్రభుత్వం, ఢిల్లీ దర్బార్‌లో సి.ఐ.ఇ. బిరుదంతోను, 1915లో సర్ (నైట్‌హుడ్) బిరుదంతోను సత్కరించింది. దేశంలోని పెక్కు విశ్వవిద్యాలయాలు డి.ఎస్.,డి.లిట్ బిరుదములిచ్చి గౌరవించాయి. 1955 లో భారత ప్రభుత్వం అత్యున్నతమైన 'భారతరత్న' బిరుదమిచ్చి సత్కరించింది. 1966లో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఆఫ్ ఇండియా సంస్థ హైదరాబాద్‌లో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పింది.

విశ్వేశ్వరయ్యగారు 'రికన్‌స్ట్రక్టింగ్ ఇండియా', 'ప్లాన్డ్ ఎకానమి ఫర్ ఇండియా' అను గొప్ప గ్రంథాలను, 'మెమోయిర్స్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్' అన్న ఆత్మకథను రాశారు.

ఇంజనీరింగ్ డిజైన్‌లు, సాంకేతిక విద్యాబోధనకు సంబంధించిన నివేదికలు, పరిశ్రమలు మున్నగు విషయాలపై పెక్కు నివేదికలు రచించారు. పరిశ్రమల ద్వారా ప్రగతి, గ్రామీణ పరిశ్రమలు, యుద్ధానంతర భారతదేశ పునర్నిర్మాణం, భారతదేశంలో భారీపరిశ్రమల స్థాపన వంటి పత్రాల నెన్నిటినో ప్రచురించారు.

విశ్వేశ్వరయ్య పుట్టుకతో బీదవారు. సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. మతాచారాలను అంతగా పాటించే వారు కారు. వారి సూట్‌కేస్‌లో 'భగవద్గీత' ప్రతి ఉండేదని వారిని బాగా ఎరిగినవారన్నారు. శాస్త్రీయదృక్పథంతో తాము విశ్వసించిన సత్యాలను నిర్మొహమాటంగా, నిర్భయంగా వెల్లడించారు. జీవితాంతం ఉద్యమమే వూపిరిగా జీవించారు.

మాస్తి వెంకటేశ అయ్యంగార్ (ఒకప్పటి సంస్థాన రెవెన్యూ కమీషనర్-జ్ఞానపీఠ ప్రశస్తి నందుకొన్న సాహితీవేత్త)

'జీవన' పత్రిక విశేషసంచిక – "విశ్వేశ్వరయ్య సంచిక" ప్రచురింపదలచి, వారి వద్దకు వెళ్ళారు. అదివరకు, ఆ పత్రిక (కన్నడ) ప్రచురించిన 'గాంధీజి విశిష్ట సంచిక'ను చూస్తూ 'హి ఆల్ సో డిడ్ ఎ థ్యాంక్‌లెస్ జాబ్' అన్నారు. విశ్వేశ్వరయ్యగారి ఆశీస్సులతో 'జీవన' విశిష్ట సంచిక వెలువడింది.

విశ్వేశ్వరయ్య జీవితం అతి నియమబద్ధం. ప్రతి దినమూ కనీసం మూడు నాలుగు మైళ్ళయినా నడిచేవారు. నగరంనుండి కారులో కొన్ని మైళ్లు వెళ్ళి అక్కడనుండి వాహ్యాళికి వెళ్ళేవారు. క్రమశిక్షణకు మారుపేరు వారు. 'ప్రతి వస్తువుకు ఒక స్థానం, ఆ స్థానంలోనే ఆవస్తువు' అన్న సూత్రం వారిది. వారి బల్లపై పెన్సిల్, రబ్బర్, గుండుసూది, జిగురు, కాగితాలు సహజావుగా వుంచుకొనేవారు. చివరిపై పున రబ్బర్‌వున్న పెన్సిల్ అంటే వారికి యిష్టం. వ్రాత అందంగా నిర్దుష్టంగా వుండేది. ఎల్లప్పుడు జేబులో కాగితం పెన్సిల్ ఉంచుకునేవారు. ముఖ్యమైన విషయాలను అక్కడికక్కడే గుర్తురాసుకుని ఇంటికి వచ్చిన తర్వాత నోట్‌బుక్ లోనికి ఎక్కించేవారు.

ప్రతి విషయంలోను కచ్చితంగా వ్యవహరించేవారు. ప్రతి ఉదయం ఒక ఫలకపై ఆనాడు తాము తీసుకునే ఆహారం మరియు వేళ వ్రాసేవారు.

రోజుకు 18 గంటలు పనిచేసేవారు. ప్రతిదినమూ తాము చేయవలసిన కార్యక్రమ వివరాలను వ్రాసుకుని వాటిని అనుసరించే వారు.

ధనకాంక్ష ఏమాత్రం లేనివారు. తన దేశానికి సదా సేవ చేసే అవకాశాలు లభించాలని ఆశించేవారు.

కఠోరమైన క్రమశిక్షణ, కాలనియమం పాటించుట, క్రమం తప్పని అలవాట్లు, సువ్యవస్థితంగా పనులు చేయటం వారి జీవిత లక్ష్యంగా వుండేది.

సుదీర్ఘమైన, పరిపూర్ణారోగ్యవంతమైన తమ జీవిత రహస్యమేమి అని కొందరు ప్రశ్నించినపుడు సమాధానంగా "కష్టపడి పనిచేయటం, క్రమశిక్షణ, నిరాడంబరజీవితం తృప్తి మరియు సంతోషం" అనేవారు.

ఆహార విహారాలలో అత్యంత నియమబద్ధులు. రాత్రి 10 గంటలకు పడుకొని ఉదయాన్నే లేచేవారు. ఉదయం కొద్దిగా ఉపాహారం, కాఫీ తీసుకొనేవారు. భోజనంలో రెండు చపాతీలు, బ్రెడ్, కొద్దిగా అన్నం, చారు, పెరుగు. మధ్యాహ్నం బిస్కెట్,కాఫీ. ఇంత మాత్రమే. మధ్యలో ఏమీ తాకేవారు కారు.

విశ్వేశ్వరయ్య స్వాభావికంగా సజ్జనులు. వృత్తిరీత్యా ఇంజనీర్, ప్రవృత్తిరీత్యా శాస్త్రవేత్త. ఏబదిఏళ్ళకు పైగా పెద్ద పదవులను అత్యంత దక్షతతో నిర్వహించారు. బంధుప్రీతి, స్వజన పక్షపాతం ఎరుగనివారు.

దివాన్ పదవి చేపట్టేముందు బంధుమిత్రులను ఇంటికి ఆహ్వానించారు. విందు చేశారు. భోజనానంతరం తమ మనోభిప్రాయాలను వెల్లడిస్తూ 'బంధువులు, మిత్రులు, ఎవరైనాసరే ఉద్యోగాలకు సిఫారసు చేయకూడదు' అని విన్నవించారు. వారందరూ సమ్మతించిన తర్వాతనే పదవిని చేపట్టారు.

బీద విద్యార్థులకు, బీద బంధువులకు ప్రతి నెలా మనిఆర్డర్‌ద్వారా ఆర్థిక సహాయం కచ్చితంగా పంపేవారు. ఆయన సాధారణంగా ఏకాంతంగా ఉండేవారు. జీవిత సంధ్యా కాలంలో మిత్రుల సలహామేరకు, తమ అన్న కుమారుడు ప్రొఫెసర్ కృష్ణమూర్తిగారి కుటుంబంతో, వారి పిల్లలిద్దరితో ఆడుకుంటూ నివసించారు. ఒక నౌకరు, వంటమనిషి ఉండేవారు.

అతి చిన్న విషయంపట్ల కూడా ఎంతో శ్రద్ధ. అధికార హోదాలో పర్యటనకు వెళ్ళినపుడు, తమ వంటమనిషి, నౌకరు ఉండేవారు. బియ్యం, కందిపప్పు వగైరా సామగ్రితో వెళ్ళేవారు. తమవెంట వచ్చే ఉద్యోగులందరికీ సహపంక్తి భోజనం ఉండేది. తమకు కావలసిన ప్రతి వస్తువునూ సొంత పైకంతో కొనేవారు.

విశ్వేశ్వరయ్యగారు ఏనాడూ ఆశువుగా ఉపన్యసించేవారు కారు. ప్రసంగ పాఠం చిత్తుప్రతిని సిద్ధపరచుకుని తప్పులను సవరించి శుద్ధప్రతిని తమ వ్యక్తిగత సహాయకుడు సుబ్బరాయప్పతో టైప్ చేయించేవారు. తాము ఏకాంతంగా ఉన్నపుడు ప్రసంగ పాఠాన్ని చదువుకుని, మరికొన్ని మార్పులు, చేర్పుల తర్వాత మరొకమారు శుద్ధంగా టైప్ చేయించేవారు. వేకువనే లేచి ఆ ప్రసంగ పాఠాన్ని చదువుకునేవారు. టైప్ పాఠాన్ని ముందుంచుకుని ఉపన్యసించటం వారి అలవాటు.

దివాన్‌గా ఉన్నపుడు ఒకసారి సంచార సమయంలో విశ్రాంతి మందిరంలో బస చేశారు. స్వయంగా పెన్సిల్ చెక్కుతూ ఉండగ ఒకసారి వేలికి గాయమైంది. ఆ సంగతి తెలిసి కబురుచేయగానే ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వచ్చి కట్టుకట్టారు. దివాన్‌గారి గుమాస్తా పాతిక రూపాయల చెక్కును విశ్వేశ్వరయ్యగారి ద్వారా డాక్టర్‌కు అందించారు. డాక్టర్ విస్మయంతో, 'తన కర్తవ్యం తాను చేశాను ప్రతిఫలం అందుకోవటమా ?' అని సవినయంగా విన్నవించుకున్నారు. 'చేసిన సేవలకు సంతోషంగా యిచ్చేవారినుండి ప్రతిఫలం స్వీకరించుటలో తప్పులేదు. ఇవ్వజాలని, అశక్తులను, బీదలను పీడించి తీసుకోవటం తప్పు. మీరు మీ కర్తవ్యం నిర్వహించినందుకు, నేను నా కర్తవ్యంగా యిస్తున్న యీ పైకాన్ని స్వీకరించండి' అన్నారు.

నిప్పులాంటి నిజాయితీపరులు విశ్వేశ్వరయ్య. దివాన్‌గా పర్యటనలో వున్నపుడు రెండు క్రొవ్వొత్తుల పొట్లాలను తీసుకుని వెళ్ళేవారు. ఒక పొట్లం సొంత పైకంతో మరొకటి ప్రభుత్వ పైకంతో కొనేవారు. సొంత పనులు చేసుకొనునపుడు తాము కొన్న కొవ్వొత్తులను, ప్రభుత్వపరమైన పనుల వేళలో ప్రభుత్వ పైకంతో కొన్న కొవ్వొత్తులను వాడేవారు. అంత విశుద్ధమైన శీలం కలవారెవరు ?

ఒకమారు విశ్వేశ్వరయ్య విదేశ పర్యటనకు సిద్ధమైనారు. మరికొంత పైకం కావలసి వచ్చింది. మైసూరు బ్యాంక్ మేనేజర్ బి. వి. నారాయణరెడ్డిగారికి ఫోన్‌చేసి సరిగ్గా ఉదయం 11-15 గంటలకు బ్యాంక్‌కు వెళ్ళారు. బ్యాంకి సిబ్బందికి ఆశ్చర్యం. మేనేజర్ ముఖద్వారం వద్దకు వచ్చి విశ్వేశ్వరయ్యగారిని సాదరంగా లోపలికి తీసుకెళ్ళారు. అప్పు దరఖాస్తు కాగితాలు సిద్ధంగా ఉన్నాయి. విశ్వేశ్వరయ్యగారు తమవద్దనున్న భారత ప్రభుత్వ రుణపత్రాలను, తమ బ్రీఫ్‌కేస్‌నుండి తీసి మేనేజర్‌గారి బల్లపై ఉంచారు. మేనేజర్ "తాము 'బాండ్'లను తాకట్టుగా యివ్వటమా ? తమ పేరే గొప్ప 'బాండ్'. అసలు ఈ బాంక్ స్థాపకులు మీరే" అంటూ బాండ్‌లను తిప్పియిచ్చినా, విశ్వేశ్వరయ్య తీసుకోలేదు. "బ్యాంకులో ఉండనివ్వండి .పైకం చెల్లించిన తర్వాత తీసుకోవచ్చు" అన్నారు. "ఇదేమిటి 3 1/2 శాతం వడ్డీవేశారు. నాకు ఎటువంటి మినహాయింపు వద్దు. అందరివద్దా వసూలుచేసే వడ్డీని మాత్రమే తీసుకోండి" అన్నారు విశ్వేశ్వరయ్య. తమ దీర్ఘానుభవంలో ఎక్కువ వడ్డీ విధించమని కోరిన వ్యక్తి విశ్వేశ్వరయ్యగారొక్కరే అన్నారు మైసూర్ బ్యాంక్ మేనేజర్.

రాజకుమారి అమృతకౌర్ గాంధీజీ ఆప్త కార్యదర్శిగా కొంతకాలం పనిచేశారు. కేంద్ర ప్రభుత్వంలో ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. ఆమె ఢిల్లీలో మంత్రిగా ఉన్నపుడు విశ్వేశ్వరయ్య ఆమె దర్శనంకోసం వారి భవనానికి వెళ్ళారు. అమృత్‌కౌర్ తన అన్నగారైన మహరాజ్‌సింగ్‌గారిని విశ్వేశ్వరయ్యగారికి పరిచయంచేసి, వారిని బొంబాయి గవర్నర్‌గా నియమించిన ఉత్తర్వుల విషయం తెలిపారు. విశ్వేశ్వరయ్య, "మీరు గవర్నర్‌గా వెళ్ళటం సంతోషం. కాని ఇప్పుడే మిమ్ము అభినందించలేను. మీ విధులను నిజాయితీతో నిష్కళంకంగా నిర్వహించినపుడు మా అభినందనలు అందజేస్తాను' అన్నారు.

విశ్వేశ్వరయ్యగారికి నూరేళ్ళ వయసు. అశక్తులుగా మంచంపై పడుకొన్నారు. కళ్ళు బాగా కనిపించేవి. చెవులు మందం. అంతే. కేంద్రప్రభుత్వంలో రక్షణశాఖ కార్యదర్శిగ పదవీ విరమణ చేసిన ఎం. కె. వెల్లోడి విశ్వేశ్వరయ్యగారి దర్శనం కోసం వచ్చారు. పరస్పర కుశల ప్రశ్నల తర్వాత, విశ్వేశ్వరయ్య మెల్లగా, భారత ప్రభుత్వ ప్రణాళికల గురించిన వివరాలను తెలుసుకొని, కుటుంబ నియంత్రణ కార్యక్రమాల అమలుపై మాట్లాడారు. జపాన్‌లో ఉన్నట్లు నిర్బంధంగా సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను అమలుచేయమని నెహ్రూ గారిని కోరినట్లు చెప్పమన్నారు. ఇదీ శతాయుష్కునికి దేశ హిత చింతన.

మనదేశంలో మాటలకు, చేతలకు అమడ వ్యత్యాసం. "తత్త్వం బ్రవీమి, పరతత్త్వ హితం బ్రవీమి: నాన్యం బ్రవీమి పరలోక హితం బ్రవీమి" అంటూ అందరు పరోపకారం చేయుటం, ధర్మం, మోక్షం గురించి ఉపదేశించేవారే. వట్టి మాటలే. విశ్వేశ్వరయ్య చెప్పినదల్లా చేశారు. ఆయన ఏనాడూ, విధి లిఖితం,కర్మ అన్న ఓటమివాద సత్త్వాన్ని ప్రదర్శించలేదు.

'జాతస్య మరణం ధృవం' పుట్టిన ప్రతిప్రాణికీ చావు తప్పదు. ప్రతి ప్రాణి జీవయంత్రం క్షీణిస్తుంది. విశ్వేశ్వరయ్య

గారి 98వ ఏట ప్రసిద్ధ నేత్రవైద్యులు డా॥ ఎం. సి. మోది వారికన్నులను పరీక్షించారు. అప్పుడుకూడా విశ్వేశ్వరయ్య కళ్ళద్దాలు లేకుండానే చదివేవారు.

విశ్వేశ్వరయ్యగారి 91 జన్మదినోత్సవాన్ని బొంబాయి తాజ్‌మహల్‌హోటల్‌లో అఖిలభారత ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసింది. ఆ సందర్భంలో వారు మాట్లాడుతూ "వృద్ధాప్యం కొన్నేళ్ళ క్రితమే నాదర్శనం కోసం చీటీ పంపింది. కాని నేను ఇంతవరకూ 'ఇంట్లో లేరు' అని చెప్పిపంపాను. నా ఆరోగ్య రహస్యం నా నియమబద్ధ జీవితంపై ఉంది. అది నా అదృష్టం. భగవంతుని దయ" అన్నారు.

'మీకు మరో విషయం చెబుతాను. ఒక సంస్కృత శ్లోక భావం యిలావుంది. నడుము వంగి, చేతనున్న కర్రసహాయంతో దారిన పోతున్న ముసలమ్మను ఒక యువకుడు ఆమెతో ఎగతాళిగా యిలా అన్నాడు. 'అమ్మా మీరేం పోగొట్టు కున్నారు ? మీరేదో వెతుకుతున్నట్లు కనిపిస్తారు ! ' 'మూర్ఖుడా నా యవ్వన రత్నాన్ని పోగొట్టుకున్న సంగతి గ్రహించలేక పోయావు' అన్నది. ఉదాత్తమైన ధ్యేయంతో కొన వూపిరి వున్నంతవరకూ పనిచేసిన కర్మయోగి ఆయన.

గంధపుచెక్కలా దేశాభ్యుదయ కృషిలో అరిగిపోయిన సేవామూర్తి విశ్వేశ్వరయ్య 102 ఏళ్లు సార్థకంగా జీవించారు. చివరిదాకా తమ ఆరోగ్యాన్ని కాపాడుకున్నారు. 1962 ఏప్రిల్ 14వ తేదీ ఉదయం గం. 6-15 ని.లకు దివంగతులయ్యారు. సకల ప్రభుత్వ లాంఛనాలతో, వారి స్వగ్రామం ముద్దేనహళ్ళిలో వారి భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి. దహనక్రియకు పెట్రోల్‌కాని, కిరోసిన్‌కాని, ఉపయోగించలేదు. అఖిలభారత అగరువత్తుల ఉత్పత్తి దార్ల సంఘం సమకూర్చిన కర్పూరపు బిళ్ళలు ఆ పుణ్యపురుషుని దేహాన్ని దహనం చేశాయి. అప్పుడు వెలువడిన సువాసన నలుదిశలా వ్యాపించింది.

000

విశ్వేశ్వరయ్య గారి మార్గదర్శకసూత్రాలు

మ న బీ ద రి కం

మనదేశంలోని అతి బీద ప్రజానీకంలో సుఖానికి బీదరికానికి మధ్యనున్న తేడా చాల అల్పమైనది.

ని వా ర ణ

ప్రజలను విజ్ఞానవంతులుగ చేయాలి. వారి ఆర్జనాశక్తిని కార్యదక్షతను పెంపొందించాలి. అభివృద్ధిచెందిన దేశాలను గమనించి వాటి అనుభవాలను మనం అవగతంచేసుకుని ముందడుగు వేయాలి.

మ న కా ర్మి కు లు

మన కార్మికులలో కార్యదక్షత అంతగా కనిపించదు. అందుకు తగిన శిక్షణ లేదు. అభివృద్ధిచెందిన దేశాల్లో ఒక కార్మికుడు చేసేపనికి మనదేశంలో ముగ్గురు కావాల్సి ఉంటుంది.

మ నం సో మ రు లం

ఆంగ్లేయుడు నిద్రవేళలో తప్ప మేల్కొన్న వేళనంతటిని ఏదో ఒక వ్యాపకానికి వినియోగిస్తాడు. వాడికి కాలం విలువ బాగా తెలుసు.

సర్ విలియం మేయర్ అనువదించిన ఒక గ్రంథంలో యిలా వ్రాశాడు. 'భారతదేశమందలి భూములు మరింత సారవంతంగా వున్నాయి. దేశంలో ఇంతకంటె ఎక్కువ ఖనిజ సంపద ఉన్నా, అక్కడి ప్రజలు పనిచేయడంలో యిప్పటివలె సోమరులుగానే వుంటారు. భారతదేశంలో సెలవు రోజులు ఎక్కువ. ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలలో ఉద్యోగం లభించిన చాలు. వాడు పనిచేయకున్నా వేతనం, ప్రమోషన్ సజావుగా వస్తాయన్న ధీమా వారిలో ఉదాసీనభావాన్ని పెంచుతున్నది

దాన ధర్మాలు

మనదేశంలో దయాళువులైనవారు బీదలను, దుర్బలులను తాము బతికినంతకాలం పోషిస్తారు. ఆ దాతలు కన్నుమూసిన తర్వాత వారి గతి ఏమి? అని ప్రశ్నించినపుడు '.అనాథ రక్షకుడైన భగవంతుడున్నాడు' అంటారు. పాశ్చాత్యుల దృష్టి వేరు. దానం ఆత్మావలంబనానికి దోహదకారి కావాలి. వికలాంగులు కూడా ఏదో ఒక వృత్తిలో నైపుణ్యం సంపాదించుకుని తమతోపాటు, తామున్న సమాజానికి తోడ్పడాలి.

సామాజిక దృష్టి

వ్యక్తులు సంఘశ్రేయస్సుకోసం పెద్ద పనులను చేపట్ట వలసిన కాలమిది. ప్రతి వ్యక్తి తన శక్తిమేరకు తన కాలాన్ని, ధనాన్ని, సమాజ కళ్యాణానికి వినియోగించాలి.

మనం స్థాపించే సంఘాలు ఎందువల్లనో చాలకాలం పనిచేయవు. అభిప్రాయ భేదాలు ఎక్కువ. సమైక్యభావం తక్కువ. ఏ సంఘమైనా ఒక వ్యక్తిపై ఆధారపడి పనిచేయరాదు. ఒక ప్రముఖ వ్యక్తి లేకున్నా, ఆయనకు బదులు మరొకరు ఆ స్థానాన్ని భర్తీచేయాలి. సంఘ కార్యక్రమాలను నిర్విఘ్నంగా సాగించాలి.

నైర్మల్యం

భారతదేశంలో అతి సుందరమైన ప్రాంతాలు పవిత్రమైన క్షేత్రాలు ఎన్నో వున్నాయి. అవన్నీ ప్రకృతి మనకు అందజేసిన వరాలు. మన దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, క్రీడాస్థలాలు, స్నానఘట్టాలు పరిశుభ్రంగా ఉంచుకునే అలవాటు మన ప్రజలలో పెంపొందాలి.

మనదేశ ప్రజలలో నిష్క్రియాపరత్వం ఎక్కువ. అంతా దైవానుగ్రహం అన్న అలసత్వభావం పోవాలి. సుఖలోలత పెరిగి కష్టాలు వద్దు అన్న వ్యక్తి నిష్ప్రయోజకుడు. ●●●

విశ్వేశ్వరయ్య గారి సూత్రాలు

- పదవిలో ఉన్నంతకాలం స్వజన పక్షపాతం ఉండరాదు.
- ఒక ఔన్సు శుభ్రత ఒక టన్ నైపుణ్యంకన్న మిన్న. చక్కగా దుస్తులు ధరించే వ్యక్తి తక్కినవారి కంటే గొప్పగా పనిచేయగలడు.
- శుభ్రమైన దుస్తులు ధరించే వ్యక్తి జీవితం కూడా స్వచ్ఛంగా వుండును.
- 'పారిశ్రామికీకరణమో–పతనమో' నిర్ణయించుకోవాలి.
- ఎల్లప్పుడూ కష్టించి పనిచేయాలి.
- ఎన్ని కష్టాలెదురైనా మంచి పనిని ప్రోత్సహించాలి.
- మన లోపాలను ప్రకృతి క్షమించదు.
- ఏ పనిలోనూ అజాగరూకత వుండరాదు. ప్రతి పని కచ్చితంగా, అసందిగ్ధంగా వుండాలి.
- కాల నియమాన్ని విధిగా అందరూ పాటించాలి.
- మీతో సంబంధంవున్న ప్రతి వ్యక్తిని ఉత్సాహవంతునిగ అప్రమత్తునిగ చేయగల అవకాశాలను వదలరాదు.
- క్రమశిక్షణతో కష్టించి పనిచేయుటవల్ల కార్యకర్త సమర్థుడగుటయేకాక దీర్ఘాయుష్కుడు కూడా కాగలడు.
- వ్యక్తి గొప్పతనానికి అతని అవిశ్రాంత కృషే కారణం.
- ఉత్తమ పౌరుని రూపొందించుటవల్లనే ఉత్తమ జాతిని నిర్మించగలం. దేశంలోని అధిక సంఖ్యాకులు ఉత్తమశీలురై, కర్తవ్య నిర్వహణలో బాధ్యతాయుతంగా వర్తించాలి.

- నాయకులు దేశభక్తులై శీలవంతులై వుండాలి. ప్రభుత్వ రంగంలోని ప్రత్యేక పదవులకు ప్రతిభ, సామర్థ్యం కలవారినే ఎన్నుకోవాలి.
- 90 శాతం చెమటోడ్పు, 10 శాతం ఉత్తేజం కలిగి వుండడమే ప్రతిభ.
- అత్యవసరమైనవాటిలో సమైక్యత, అవసరంలేని వాటిపట్ల స్వేచ్ఛ, అన్ని విషయాలలోను ఔదార్యం అవసరం.
- సౌకర్యాలకంటే కర్తవ్యపాలన ముఖ్యం.
- చేయదగిన ప్రతి పనిని ప్రశస్తంగా చేయాలి.
- సేవావకాశాలను అన్వేషించాలి కాని పిలుపుకోసం వేచివుండ రాదు.
- మనం పురోగమించుటకు అమెరికన్ల 'వేగం' జర్మన్ల 'గట్టి కృషి' అనుసరించాలి.
- తమను తాము ఉద్ధరించుకునేవారినే భగవంతుడు ఉద్ధరిస్తాడు అన్న వాస్తవాన్ని గుర్తించాలి.
- ఏనాడూ, ఎవరి దయా దాక్షిణ్యాలపై ఆధారపడరాదు.
- తాము పాల్గొను కార్యక్రమాలతోపాటు తక్కిన విషయాలలో కూడా కాలనియమం పాటించుట ముఖ్యం.
- వ్యక్తి తన ఆదాయ పరిమితి ననుసరించి జీవించాలి. భోగాలను ఆశించరాదు.
- మన కర్తవ్యాన్ని సంతోషంగా నిర్వహించాలి కాని సుఖాన్వేషణకోసం ప్రాకులాడరాదు.

- అభివృద్ధిచెందిన పాశ్చాత్య దేశాల స్థాయిని లేదా ఉదయోన్ముఖమైన జపాన్ స్థాయిని అందుకోవటానికి భారతదేశం పురోగమించాలి.

- కష్టించి పనిచేయాలి. సంతోషచిత్తులై వుండాలి. సంతృప్త మనస్కులు కావాలి. సాధ్యమైనంత ఎక్కువకాలం ఆరుబయలులో గడపాలి. (శతజయంతి ఉత్సవ సందర్భంగా)

- వ్యక్తి విజయం లేదా సంతోషం అతని కృషిపై ఆధారపడి వుంటుంది. ఒకరు మరొకరి జీవితాన్ని రూపొందించలేరు. స్వయంగా ఆలోచించి జీవిత పథకాన్ని సిద్ధపరచుకోవాలి.

- ప్రభుత్వం మరియు జాతీయ నాయకులు సమైక్యభావంతో జాతీయ శీల నిర్మాణానికి గట్టి కృషిచేయాలి.

★

నివాళులు

నిష్కళంకమైన నిజాయితి, ఆదర్శపూర్ణమైన శీలం మూర్తీభవించిన మహనీయుడు సర్. ఎం. విశ్వేశ్వరయ్య. వారి నిజాయితీ నమ్మశక్యంకానంత గొప్పగా వుండేది.

— రాజాజీ

సౌజన్యం, నిష్పాక్షికత, దూరాలోచన మున్నగు విశిష్ట గుణములతో వెలిగిన మహాపురుషులు విశ్వేశ్వరయ్య.

— చింతామణి దేశ్‌ముఖ్

పారిశ్రామికరంగం కావచ్చు—పాలనారంగం కావచ్చు, వాణిజ్యరంగం కావచ్చు—ఏ రంగంలోనైనా వారి నిస్వార్థ, నిర్విరామకృషి, చిత్తశుద్ధి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

— డా॥ రాజేంద్రప్రసాద్

గొప్ప ఇంజనీర్, గొప్ప రాజనీతిజ్ఞుడు, గొప్ప దేశభక్తుడు. ఇన్ని గొప్పలున్నా ఆయన అతి నిరాడంబరుడు, వినయపూర్ణుడు. భారతదేశ పారిశ్రామిక ప్రగతికి, ప్రణాళికా బద్ధమైన పద్ధతికి అంకురార్పణ మొనర్చిన మహనీయుడు విశ్వేశ్వరయ్య.

— డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

విశ్వేశ్వరయ్య స్వాప్నికుడు, మహామేధావి. క్రియాశీలి. గతంలోని గొప్పదనాన్ని విస్మరించక సదా భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ తన కలలను సాక్షాత్కరింపచేసుకున్న ధన్యజీవి వారు.

— పండిట్ నెహ్రూ

హిమాలయాలను హిమాలయాలతో మాత్రమే పోల్చగలం. సాగరానికి సాటి సాగరమే. అట్లే విశ్వేశ్వరయ్య గారిని మరెవరితోను పోల్చలేము. ఆయన కాయనే సాటి. మహాభారత భీష్మాచార్యుడు—ఆధునిక అమెరికా పారిశ్రామిక వేత్త హెన్రీ ఫోర్డు-ల అపూర్వ సమ్మేళనం శ్రీ విశ్వేశ్వరయ్య.

— ఎన్. డి. సనూకర్

వాస్తుశాస్త్ర విజ్ఞానం, అర్థశాస్త్ర వైదుష్యం, మానవత్వం ముప్పిరిగొని మూర్తీభవించిన మహోదాత్త పురుషులు విశ్వేశ్వరయ్యగారు.

— ప్రొఫెసర్ ఎం. ఎస్. థక్కర్

Wardha
23rd November, 1934

Dear Friend,

I thank you for your prompt reply. I see that we hold perhaps diametrically opposite views. My conviction based upon extensive experience of village life is that in India at any rate for generations to come we shall not be able to make much use of mechanical power for solving the problem of the evergrowing poverty of the masses. We are too many and we have so many idle hours at our disposal that it would be suicidal to make use of mechanical power and allow human power to run to waste The question of leisure after toil comes into being when people learn the art of making effective use of their waste hours Such being my view the extract that you have sent me from Stalin has no appeal for me at all. The more expressive extract from Lenin makes matters worse for me It is like much cry and little wool. I could be no party to engaging the villagers in producing army machinery and army stores. If India has no desire to take part in the goary exploitation of un-mechanised regions of the earth, she has no need to fear aggression from foreign countries. My dream will remain wholly unrealised and India may become a willing or unwilling partner in the sin of exploitation. I want to put the whole of my force that God may vouchsafe to me in stemming the onrush of the violent current. I should take delight in perishing in the attempt.

Inspite of the strength of my conviction, I entertain great regard for your fine abilities and love of the country, and that shall be unabated whether I have the goodfortune to secure your co-operation or face your honest opposition.

Yours sincerely,
Sd/-
(M K. GANDHI)

Sir M. Visvesvaraya, K. C. I. E.,
46, F. Warden Road,
Bombay.

46 F. Warden Road,
Bombay,
27th November 1934.

Dear Mahatmaji,

I am much obliged to you for your letter dated the 23rd November.

You say we hold perhaps diametrically opposite views. You are for developing village industries and I favour both heavy industries and village industries. To the extent that you propose to advance village Industries, I am at one with you I can never persuade myself to take up a hostile attitude towards any constructive work, from any quarter, least of all towards work attempted by one with your brilliant historic achievements in public life.

You seem to assume that I want to prepare the country for exploiting somebody or other. That view is wholly unwarranted. I am in favour of heavy industries at least as strongly as of village industries, because :

(1) heavy industries will save the money that is going out of the country in large sums every year ;

(2) heavy industries are required to provide the local manufacture of machinery and equipment required by our Railways and for our Defence Forces ; and

(3) heavy industries are required also for supplying machinery and tools for the village Industries themselves.

You may be aware that in some years as much as Rs. 25 to 35 crores have been spent on imported machinery, locomotives, etc., for Railways and the Defence forces. I meant that this should be reduced or minimised, and to that extent money should be saved and work found for our own people This is merely to arrest impoverishment of the country. There is no exploitation in this

I recommend more extended use of mechanical power because it produces results for the country much more rapidly than human power. The object is to get food and commodities required by our people for a decent standard

of living as speedily as possible. The question of distribution of products is no doubt one of some difficulty at present and that difficulty is facing the entire civilized world. If a journey of 100 miles has to be accomplished and there is choice before you of a bullock cart or a motor car—you certainly would not choose a bullock cart Neither in America nor in Russia where two opposite types of industrial development are being practised is mechanical power undervalued to the extent you proposed to do.

If India has to advance in material prosperity, it should be along lines which have succeeded elsewhere. It is only in regard to the methods that we differ; and may I add that the methods I advocate are suggested by experience and has today the approval of the civilized world?

I have a lot to say but I have no wish to seem controversial. If you think heavy indusrries do not require encouragement, I will not refer to that aspect at all. I will not on that account oppose your other beneficent plans.

With assurances of high regard,

Yours sincerely,

Sd/-

(M. VISVESVARAYA)

Mahatma M. K. Gandhi,
Wardha.